RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 09-04-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 39 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal
Follow us on

# 2 వారాల పాటు కాల్పుల విరమణ

## పశ్చిమాసియాలో చిగురించిన ఆశలు, లెబనాన్‌లో ఆగని యుద్ధం



### తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి

- అమెరికాకు ఇరాన్ 10 సూత్రాల ప్రతిపాదన
- పలు వివాదాస్పద అంశాలపై గతంలోనే అంగీకారం కుదిరింది, అవి చర్చలకు మంచి ప్రాతిపదికలు, ఇరాన్‌కు ఆయుధాలు ఇచ్చిన దేశాలపై 50 శాతం టారిఫ్, యురేనియం శుద్ధికి నో : ట్రంప్
- కాల్పుల విరమణను స్వాగతించిన భారత్
- హోర్ముజ్ గుండా ప్రయాణించిన రెండు నౌకలు
- హోర్ముజ్ వద్ద సుంకాలు విధించలేం : ఒమన్



వుదయం డెస్క్, ఏప్రిల్ 8 :అమెరికా–ఇరాన్ రెండు వారాల పాటు కాల్పుల విరమణ ప్రకటించాయి. ఈ సమయంలో చర్చలు జరపాలని నిర్ణయించుకున్నాయి. దీనితో పశ్చిమాసియాయే కాకుండా మొత్తం ప్రపంచం హాయిగా ఊపిరి పిల్చుకున్నది. అయితే ఈ తాత్కాలిక సంధి గురించి వార్తలు వెలువడిన గంటలోపే ఇరాన్‌లోని లవణ్ కర్మాగారంపై యుఎస్, ఇజ్రాయెల్ దాడి జరుగగా, ప్రతిగా ఇరాన్ యుఎఇపై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌కు ఈ సంధి వర్తించదని స్పష్టం చేసింది.

ఇరు పక్షాలూ దీనిని తమ విజయంగా ప్రకటించుకుంటున్నాయి. యుఎస్ తమ షరతులకు లోబడిందని ఇరాన్ ప్రకటిస్తుండగా, ఇరాన్ దాదాపుగా తమ శరణువేడిందని ట్రంప్ అంటున్నారు. ఏమైనప్పటికీ, కాల్పుల విరమణ జరగడం, హొర్ముజ్ జలసంధిని సురక్షితంగా తెరవడం ఇందులో కీలకం.



### భారత్ హర్షం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (వుదయం డెస్క్): ఇరాన్, అమెరికాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ బుధవారం స్వాగతించింది. ఈ ఒప్పందం పశ్చిమ ఆసియాలో కొన సాగుతున్న సంఘర్షణకు రెండు వారాల పాటు విరామం

అమెరికా దేనికి అంగీకరించింది..?

కాల్పుల విరమణ ఒప్పంద నిబంధనల ప్రకారం, వాషింగ్టన్ సైనిక లక్ష్యాలన్నీ నెరవేరాయని, అలాగే ఇరాన్ హొర్ముజ్ జలసంధిని పూర్తిగా, తక్షణమే మరియు సురక్షితంగా తెరిచేందుకు అంగీకరించిందని పేర్కొంటూ–అమెరికా, ఇరాన్‌పై తన సైనిక దాడులను ప్రాథమికంగా రెండు వారాల పాటు నిలిపివేయడానికి అంగీకరించింది.

ప్రపంచంలోని ఐదవ వంతు చమురు, గ్యాస్‌కు ఈ జలసంధి ఒక కీలక మార్గం. ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధానికి ప్రతీకారంగా తెహ్రాన్ దీనిని వాస్తవంగా మూసివేసింది.

కాగా, ఇరాన్ నుండి అమెరికాకు 10 సూత్రాల ప్రతిపాదన అందిందని, అది చర్చలు జరపడానికి ఆచరణీయమైన ప్రాతిపదిక అని ట్రంప్ అభివర్ణించారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య గతంలోని వివిధ వివాదాంశాలలో దాదాపు అన్నింటిపై అంగీకారం కుదిరింది, అయితే ఈ ఒప్పందాన్ని ఖరారు చేసి, పూర్తి చేయడానికి రెండు వారాల సమయం లభిస్తుంది, అని ఆయన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్ పై పోస్ట్ చేశారు.

పూర్తి 10–సూత్రాల ప్రణాళిక ఇంకా బహిర్గతం కానప్పటికీ, అందులో కింది అంశాలు ఉన్నాయని అల్ జజీరా పేర్కొంది.

1. అమెరికా నుంచి దురాక్రమణ చేయమన్న ప్రాథమిక నిబద్ధత.

---

## మామునూర్ ఎయిర్ పోర్టుకు 3 నెలల్లో శంకుస్థాపన

- ఆదిలాబాద్ లో పెద్ద ఎయిర్ పోర్టు నిర్మాణం
- సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు
- సివిల్ ఏవియేషన్‌తో కలిసి పని చేసేందుకు రక్షణ శాఖ అంగీకారం
- ఈ నెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు
- అంతర్గాంఎయిర్ పోర్టు ప్రతిపాదనపై ఫీజబులిటీ నివేదిక సానుకూలం : మీడియాతో కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు సంబంధించి వస్తోన్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఫీజిబులిటీ ఉన్న చోట ఎయిర్ పోర్టుల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో కలిసి ఆయన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో భేటీ అయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి అక్కడి మీడియాతో మాట్లాడారు. వరంగల్ ప్రజల చిరకాల స్వప్నం మామునూరు ఎయిర్‌పోర్టుకు మూడు నెలల్లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆదిలాబాద్ లో పెద్ద ఎయిర్ పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోందన్న ఆయన సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం సివిల్ ఏవియేషన్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణశాఖ సైతం చెప్పిందని వెల్లడించారు. ఈ నెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు వెళ్తారని, రక్షణ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన తర్వాత నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆదిలాబాద్ లో రక్షణ శాఖకు 360 ఎకరాలు ఉందని,

---

## సిఎస్ఆర్ నిధులను బాధ్యతగా వెచ్చించండి

- ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి
- అవసరమైన సహకారం మేం అందిస్తాం : కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :** కంపెనీలు సమాజాభివృద్ధికి చేసే ఖర్చును అనవసర ఖర్చుగా కాకుండా సమాజంలో భాగస్వామ్యంగా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి



కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని...

---

## నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

### నాదర్గుల్, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ భూ అక్రమాల్లో మా ప్రమేయం లేదు

- శకుని మామ డైరెక్షన్ లో డ్రామా రావుల నాటకం
- ప్రభుత్వ ఆదరణ చూసి ఓర్వలేకే నిరాధార ఆరోపణలు
- తమ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే కుట్ర : మీడియాతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :** శకుని మామ కేసీఆర్ డైరెక్షన్‌లో అబద్దాల హరీష్‌రావు, డ్రామారావు కేటీఆర్ లు తమ ప్రభుత్వం, మంత్రులపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దుయ్యబట్టారు. గత పదేళ్ల తమ పాలనలో రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఒంటి నిండా అవినీతి బురద పూసుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఆ బురదను ప్రజా ప్రభుత్వానికి అంటించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ పథకాలకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, పాత తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నాదర్గుల్, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ భూ అక్రమాలపై హరీశ్ రావు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఒకవేళ రాష్ట్రంలో ఎక్కడైనా భూ అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. బుధవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నంప్రభాకర్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, సామెల్ , బి.లక్ష్మారెడ్డి, శ్రీ గణేష్, రాంమోహన్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి ఆరోపణలను ఖండించారు. నాదర్‌గుల్ భూములకు సంబంధించి 2014లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేసిందని ఆయన ఆధారాలు బయటపెట్టారు. హరీశ్ రావు ఆరోపిస్తున్న సర్వే నంబర్ 613లోని భూములను 2014లో అప్పటి బీఆర్ఎస్

---

## ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పు 22కి వాయిదా



**హైదరాబాద్, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :** కాళేశ్వరం కమిషన్ నివేదికపై తీర్పు వాయిదా పడింది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన ఈ ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు, దాని విచారణ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు బుధవారం తుది తీర్పు వెల్లడించాల్సి ఉంది. దీంతో హైకోర్టు తీర్పుపై అందరూ ఉత్కంఠగా ఎదురుచూశారు. కానీ రాష్ట్ర ధర్మాసనం తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా...

---



## సున్నిత కేసుల్లో సుప్రీం తీర్పులను ప్రశ్నించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (వుదయం) :** వివాహేతర సంబంధాలను, స్వలింగసంపర్క సంబంధాలను నేరరహితం చేస్తూ ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులు, రాజ్యాంగ నైతికతను వ్యక్తిగత అభిప్రాయాలు, వ్యాఖ్యానం చేయడంపై ఆధారపడి ఇచ్చినవని, వాటిని మెరుగైన చట్టంగా పరిగణించకూడదని బుధవారం కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. శబరిమల ఆలయ సమస్యతో సహా మత స్వేచ్ఛలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ జరుపుతున్న సందర్భంగా, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఈ వాదనలు వినిపించినట్లు పీటీఐ వార్తా సంస్థ నివేదించింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, రాజ్యాంగ నైతికత అనేది ఒక అస్పష్టమైన భావన అని, చట్టాల న్యాయ సమీక్షకు అది ఏకైక కొలమానంగా ఉపయోగపడదని వాదించారు. ప్రజాస్వామ్యంలో...

# ఆదిశంకరాలో దండి 2.0 అవగాహన కార్యక్రమం



**గూడూరు,ఏప్రిల్ 07 , వుదయం ప్రతినిధి:** ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ, గూడూరు ప్రాంగణంలో 2025 ఏప్రిల్ 08న "డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్" లో భాగంగా వైబ్రంట్స్ ఆఫ్ కలాం మరియు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సహకారంతో "డాండీ మార్చ్ 2.0" అనే భారీ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. మహాత్మా గాంధీ చారిత్రాత్మక డాండీ యాత్రకు ప్రేరణగా ఈ కార్యక్రమం ప్రజల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచి, యువతను చైతన్యవంతం చేయడం ద్వారా మత్తు రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతోంది. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. కిశోర్ బాబు, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె. తిరుపతయ్య , ఈగల్ సబ్ ఇన్స్పెక్టర్ జె.ఎస్. రాజీవ్ కుమార్ పాల్గొని తమ ప్రోత్సాహాన్ని తెలియజేశారు. అలాగే యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. ఎం. రాజయ్య , డిప్యూటీ రిజిస్ట్రార్ జె. రామయ్య గారు, ప్రిన్సిపాల్ డా. జె. అమరేంద్ర గారు, ఇతర డీన్లు, విభాగాధిపతులు మరియు సిబ్బంది హాజరయ్యారు. "ది గ్రేటెస్ట్ డ్రగ్ ఫ్రీ మార్చ్ ఆన్ ఎర్త్" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 1000 కిలోమీటర్ల ప్రయాణం, 100 నియోజకవర్గాల భాగస్వామ్యం, 100 మంది ప్రముఖుల పాల్గొనడం మరియు 100 మీటర్ల జాతీయ జెండాతో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. "మత్తు పదార్థాలు మీ కలలను దూరం చేయనివ్వకండి" అనే సందేశంతో విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర పాల్గొనేవారు ర్యాలీలో చురుకుగా పాల్గొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజంలో అవగాహన కల్పించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యాసంస్థలు బాధ్యత గల పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని స్పష్టమైంది.

# పార్టీలకు అతీతంగా సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడి



**గూడూరు,,ఏప్రిల్ 07 , వుదయం ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి ద్వారా సుమారు 6 కోట్ల రూపాయలు అందించామని ఇంకా ఎవరైనా సీఎం సహాయనిది కావాలనుకుంటే వారు పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు .గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు స్థానిక ఎమ్మెల్యే సునీల్ కుమార్ వారికి ఘన స్వాగతం పలికారు కార్యకర్తలను పరిచయం చేశారు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 19 లక్షల 52 వేల 80 రూపాయల చెక్కులను 42 మంది లబ్ధిదారులకు అందజేశారు అరుంధతి పాలెం కు చెందిన పేద విద్యార్థి ప్రవీణ్ తేజ కు కంప్యూటర్ ఎన్ ఆర్ పల్లి కి చెందిన వెంకటసుబ్బయ్యకు వీల్ చైర్ అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎంఆర్ అందిస్తున్నామని పేద ప్రజల ఆరోగ్య విషయంలో నాయకులెవరు పార్టీలు చూడొద్దని సూచించారు అలాగే సీఎం సహాయనిధి అందిస్తున్నా ముఖ్యమంత్రి చంద్ర బా బు నా యు డు పేరు నాయకులు లబ్ధిదారులకు తెలియజేయాలని కోరారు గోపాలపురం ఎమ్మెల్యే వెంకట రాజు మాట్లాడుతూ సునీల్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని ఇప్పటివరకు నియోజకవర్గంలో 779 మందికి సీఎం సహాయ నిధి అందించడం అభినందనీయమని అన్నారు మంచి నాయకత్వంలో నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేసి రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, రహీం ,శివకుమార్ ,కిషోర్ నాయుడు ,భాస్కర్ రెడ్డి ,శ్రావణి, ప్రమీల ,తదితరులు పాల్గొన్నారు

# చెంచుగానిపాలెం ప్రత్యేక అధికారిని ని సన్మానించిన నాయకులు



**కావలి, ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి** :కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారినిగా మండల వ్యవసాయ అధికారిని లలిత ను నియమించారు. ఈనెల రెండవ తేదీతో సర్పంచుల పాలన ముగియడంతో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగా బుధవారం ప్రత్యేక అధికారిని లలిత ఆ పంచాయతీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అఖిల ఆమెను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు మాజీ సర్పంచులు పోసిన జాలరావ్, దద్దాల ప్రభాకర్, అలాగే పోసిన శ్రీనివాసులు, తాతా హరిబాబు అనే నాయకులు ఆమెను శాలువాతో సన్మానించి, ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలు చర్చించుకున్నారు. అందరం కలిసికట్టుగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు ప్రత్యేక అధికారిని లలిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువు పాల్గొన్నారు.

# మహిళల గౌరవం గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్ఆర్‌సిపికి లేదు

## - రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి



**కావలి, ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి:** మహిళల గౌరవం, భద్రత, ఆత్మగౌరవం వంటి విలువల విషయంలో వైఎస్ఆర్‌సిపి చాలా కాలం క్రితమే తన నైతిక హక్కును కోల్పోయిందని రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి ఘాటుగా విమర్శించారు. బుధవారం కావలిలో ఆమె మాట్లాడుతూ మహిళలను కవచంగా పెట్టుకుని రాజకీయ డ్రామాలు ఆడటం వైఎస్ఆర్‌సిపి నాయకుల నిత్యకృత్యంగా మారిందని ఆమె మండిపడ్డారు. నిజంగా మహిళల పట్ల గౌరవం ఉంటే, గతంలో జరిగిన అవమానాలపై ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా మహిళల గౌరవాన్ని తుంచిపారేసినప్పుడు నవ్వులు చిందించినవారే, ఇప్పుడు నకిలీ సెంటిమెంట్‌తో రోడ్లపైకి రావడం ప్రజలను మోసం చేసే చీప్ నాటకమని ఆమె తీవ్రంగా ఎద్దేవా చేశారు. నారా భువనేశ్వరిని, నారా బ్రాహ్మణిని, హోమ్ మంత్రి అనితని, అలాగే అమరావతి ఆడపడుచులను అవమానించినప్పుడు వైఎస్ఆర్‌సిపి మహిళా నాయకులు ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఆమె నిలదీశారు. కన్నతల్లి గురించి అసభ్య వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు వచ్చినప్పుడు మౌనం పాటించినవారు, ఇప్పుడు చిన్న పదాన్ని కారణంగా చూపించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడం వారి ద్వంద్వ వైఖరికి స్పష్టమైన ఉదాహరణ అని ఆమె విమర్శించారు. కేవలం 11 సీట్లు వచ్చినా కూడా వైఎస్ఆర్‌సిపి నాయకులకు బుద్ధి రాలేదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. అమరావతిని రాజధానిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించగానే, "జగన్‌కు మళ్లీ మావిగన్ గుర్తుకొచ్చింది" అంటూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. ఓ పత్రికలో ఏదో రాసారనే కారణాన్ని అడ్డం పెట్టుకుని, రాష్ట్రంలో అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కావాలనే రచ్చ సృష్టిస్తూ, ఇప్పుడు మహిళల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు. రాజధాని అమరావతి విషయంలో రాష్ట్ర ప్రజలు, దేశం మొత్తం మద్దతు తెలుపుతున్నప్పటికీ, తమ పార్టీ నేతకు నిజం చెప్పే ధైర్యం లేని నాయకులు, ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి సవాళ్లు విసరడం పూర్తిగా సిగ్గుచేటని ఆమె పేర్కొన్నారు. పార్టీలో చర్చలు జరపడానికి సత్తా లేని వారు, బయట ధర్నాలు చేసి హంగామా చేయడం రాజకీయ దివాళాకోరు పరిస్థితికి నిదర్శనమని ఆమె అన్నారు. ఇప్పటికైనా వైఎస్ఆర్‌సిపి నాయకులు ఈ ద్వంద్వ రాజకీయాలు, నాటకాలు మానుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించేలా ప్రవర్తించకపోతే, ప్రజలే తగిన సమాధానం ఇచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆమె కఠినంగా హెచ్చరించారు.

# పిల్లల భవిష్యత్తు బలపడాలంటే తొలి 6 సంవత్సరాలే కీలకం

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



**నెల్లూరు, ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి**: చిన్నారుల జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైనవని, ఈ దశలో సరైన పోషణ, సంరక్షణ ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు.బుధవారం తన ఛాంబర్ నందు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ పోషణ్ పక్షవాడా కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పోషణ్ పక్షవాడా కార్యక్రమాలు ఏప్రిల్ 9 నుండి 23 వరకు "సహీ పోషణ్, దేశ్ రోషన్" అనే నినాదంతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లి, శిశు పోషణ, 0-3 సంవత్సరాల పిల్లల మెదడు అభివృద్ధికి ప్రారంభ ప్రేరణ, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆటల ఆధారిత ప్రారంభ విద్య, స్క్రీన్ టైమ్ తగ్గింపులో తల్లిదండ్రులు సమాజం పాత్ర, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి సమాజ మద్దతు వంటి ముఖ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, అంగన్వాడీ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ గారు తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ ను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ప్రతి లబ్ధిదారునికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సుజాత, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ అనురాధ, అధికారులు, జిల్లా స్థాయి అధికారులు మరియు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి



**నెల్లూరు, ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి:** జిల్లాలో నీటి వనరుల సమర్ధ వినియోగం, భూగర్భ జలాల పెంపుదలకు జలధారజలహారతి సాగు నీటి సంఘాల బాధ్యత (జె.జె.ఎస్.ఎస్.బి) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.బుధవారం నెల్లూరు కలెక్టరేట్ లోని తన ఛాంబర్ నందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాలోని వివిధ బేసిన్లు, ఉప బేసిన్లలో నీటి లభ్యతపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు సమగ్ర, స్థిరమైన చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అధిక నీరు లభ్యమయ్యే బేసిన్లను నీటి కొరత ఉన్న బేసిన్లతో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత కాస్కేడ్ వ్యవస్థలను మెరుగుపరచి, సాధ్యమైనచోట దిగువ సాగు చెరువులకు విస్తరించాలని తెలిపారు. దెబ్బతిన్న, లీకేజీ ఉన్న చెక్ డ్యామ్‌లను ప్రాధాన్యంతో పునరుద్ధరించడంతో పాటు, అనుకూల ప్రదేశాల్లో కొత్త సాగు నీటి చెరువుల ఏర్పాటు సాధ్యతను పరిశీలించాలని ఆదేశించారు.చెరువుల కట్టలను బలోపేతం చేస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టాలని, కాలువలలోని పూడికను తొలగించాలని, తూములు, కలుజుల మరమ్మత్తులు వేగవంతం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిర్దిష్ట కాలంలో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ నాయక్, సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎస్ఎస్ఎల్సీ & ఎస్బీ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, జలవనరుల శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీరర్లు, భూగర్భ జల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి ఘన వీడ్కోలు

**నెల్లూరు, ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందినీ ఎస్పీ అజిత వేజెండ్ల సమక్షంలో ఘనంగా సన్మానించారు. పదవి విరమణ పొందిన బి జయంత్ కుమార్, కె హజరత్ లకు జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల, మరియు అడిషనల్ యస్.పి. (అడ్మిన్) సౌజన్య ఆత్మీయంగా సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా యస్.పి. మాట్లాడుతూ, సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహించి సేవలు అందించడం అభినందనీయమని, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అడిషనల్ యస్.పి మాట్లాడుతూ, వారి సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని పదవీ విరమణ పొందిన సిబ్బందిని పూలమాలలు, దుశాలువాలతో ఘనంగా సన్మానించారు.

# బాధితునికి 25 వేల రూపాయల ఆర్థిక సాయం

**గూడూరు ఏప్రిల్ 08, వుదయం ప్రతినిధి:,** రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముత్తుకూరు మండలం ,ఈపూరు గ్రామానికి చెందిన మహమ్మద్ భాష , 19 సంవత్సరాలు , దురదృష్టవ శాత్తు ప్రమాదానికి గురై చెన్నై లోని కావేరి హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు , వాళ్ళది చాలా పేదకుటుంబం , వైద్యఖర్చుల కోసం మన ట్రస్ట్ ని సంప్రదించగా ఈరోజు 25,000 రూపాయలు ఆర్థిక సహాయం మన ట్రస్ట్ సభ్యుడు సుభాన్ ద్వారా చెన్నై హాస్పిటల్ లో వాళ్ళ కుటుంబ సభ్యులకి అందించటం జరిగింది.






# డిసిసి ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డికి ఘన సన్మానం

**కాంగ్రెస్ పార్టీ యువ నేత ఈదులపల్లి శ్రీనివాస్**

**వెల్దండ ,ఏప్రిల్ 8 (వు దయం):**

ఇటీవల నియమితులైన.జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్య క్షులు యెన్నం భూపతిరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్ లను . బుధ వారం కాంగ్రెస్ పార్టీ యు వ నాయకుడు ఈదుల పల్లి శ్రీనివాస్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్య క్రమంలో మాజీ సర్పం చ్ రామచంద్రారెడ్డి,మాజీ ఉప సర్పంచ్ వెంకట య్య పుల్లయ్య,ఎండి రషీ ద్,గజినీ శ్రీను లక్ష్మణ్ నాయక్ గోపాల్ రవీందర్ కిషన్ లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి పార్టీ పట్టణ అధ్యక్షులుగా చంద్రు ముదిరాజ్



**నారాయణపేట , ఏప్రిల్ 8 (వుదయం ప్రతినిధి)**

నారాయణ పేట్ పట్టణ తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షులు గా మయూరి చంద్రు ముదిరాజ్ ( సంక్లపూర్ చంద్రు )ని తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షులు కవిత ఆదేశాల తో నియమించినట్లు జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు. కాగా నారాయణపేట పట్టణ అభివృద్ధికి జిల్లా అభివృద్ధికి పార్టీ ఆదేశాల మేరకు కట్టుబడి పని చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. బడుగు బలహీన వర్గాల సమస్యలను సైతం ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తామని వారు అన్నారు. తెలంగాణ జాగృతి పార్టీ నారాయణపేట పట్టణ అధ్యక్షులు గా మయూరి హోటల్ చంద్రుని నియమించినందుకు ఆయనతో పాటు

సహచరులు పట్టణ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి నుండి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**కొనుగోలు కేంద్రాల మంజూరు కు సహకరించిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేసిన జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల నియోజకవర్గంలో నేడే అనగా తేదీ 9 4 2026 గురువారం 3 మండల కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు బుధవారం ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి మార్క్ పేడ్ ఎండి ని సంప్రదించగా అత్యవసరంగా కోరుట్ల నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు ఇట్టి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల మంజూరు కి సహకరించిన బడుగు బలహీనవర్గాల నాయకులు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కోరుట్ల నియోజకవర్గ రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు

జువ్వాడి కృష్ణారావు తెలియజేశారు

# ప్రజా పాలనలో భాగంగా గర్భిణీ స్త్రీలకు వైద్య సూచనలు



**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు అనుసరించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు పోషకాహారం నియమిత పరీక్షలు ప్రసవానికి ముందస్తు ఏర్పాట్లపై వైద్యులు

సలహాలు సూచనలు చేశారు గర్భధారణ సమయంలో తల్లి శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవానికి (నార్మల్ డెలివరీ) ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ మహిళలు సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలను

పాటించాలని తెలిపారు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు అలాగే సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తల్లి శిశువు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) సుజాత డిప్యూటీ డిఎంహెచ్ఓ జైపాల్ రెడ్డి సూపరిండెంట్ కృష్ణమూర్తి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సురక్షిత మాతృత్వంపై అవగాహన అవసరం

**టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**

**తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి ,వుదయం.**



సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "సేఫ్ మదర్ డే" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీలకు అవసరమైన ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ఏఎన్‌సీ చెకప్‌లు మాతృ మరణాల రేటు తగ్గించడం సిసెక్షన్, హై రిస్క్ గర్భధారణలు, అత్యవసర పరిస్థితులు, పీసీపీఎన్‌డీటీ చట్టం వంటి అంశాలపై డాక్టర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, తల్లి-బిడ్డల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలను అందిస్తున్నదన్నారు. గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున మైనర్ బాలికల వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, సురక్షిత ప్రసవాలు మరియు తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భధారణ సమయంలో సమయానుకూల వైద్య పరీక్షలు, టీకాలు, పోషకాహారం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. సమగ్ర ప్రణాళికతో పనిచేసి మాతృ మరణాల రేటును (మ్యాటర్నల్ మోరటాలిటీ ) జీరోకు తీసుకురావడానికి కృషి చేయాలని తెలిపారు.కొత్తగా తల్లులైన మహిళలకు అవసరమైన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆసుపత్రి స్థాయిలో ఆశా, ఏఎన్ఎంల ద్వారా మండల సమాఖ్య మహిళలకు తల్లి-బిడ్డల సురక్షితంపై వర్క్‌షాప్‌లు నిర్వహించి గర్భిణులకు సమగ్ర సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేఫ్ మదర్ హుడ్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వసంత్ రావు, జీజీహెచ్




సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డా. కవిత, ప్రోగ్రాం అధికారులు డా.నాగనిర్మల, డా . శశాంక్ , డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ , ఏప్రిల్ 8 (వుదయం)**



గర్భిణీ స్త్రీలు మరియు బాలింతల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ శివదయాల్, డీఎంఏ సూపరింటెండెంట్ సునీత, గైనకాలజిస్ట్ రాజేశ్వరి, డాక్టర్ సృజన, డీడబ్ల్యూవో హేమభార్గవి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జో.జి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా వైద్య నిపుణులు తల్లి ప్రాముఖ్యతపై మాట్లాడి, తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం,

సమయానుకూల వైద్య పరీక్షలు, సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని, దాంతో ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వివాహానికి ముందు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్యపరీక్షలపై అవగాహన కల్పించడం సురక్షిత మాతృత్వ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ ద్వారా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు గ్రామీణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సురక్షిత మాతృత్వ దినోత్సవం ద్వారా గర్భధారణకు ముందు, సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,

చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్, డిప్యూటీ డీఎంహెచ్వోలు, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ ప్రసూతి వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ భేటీ

**విశ్రాంత ఉద్యోగుల మాస సమావేశం ఘనంగా – సమస్యలపై చర్చ, జన్మదిన వేడుకలు నిర్వహణ**

**రామచంద్రపురం ,ఏప్రిల్ 8 (వుదయం)**



రామచంద్రపురం యూనిట్ పరిధిలో విశ్రాంత ఉద్యోగుల మాస సమావేశం శ్రీ పి. రాంరెడ్డి గారి అధ్యక్షతన స్నేహపూర్వక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం, పెన్షన్ సమస్యలు, ఆరోగ్య సదుపాయాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశాన్ని ఉద్దేశించి పలువురు సభ్యులు మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పెన్షన్ సవరణలు, వైద్య సేవల మెరుగుదల, వృద్ధులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఈ నెలలో జన్మదినం ఉన్న సభ్యులు రామకృష్ణరాజు, రామచంద్రయ్య, మధుసూదనరావు, వెంకటరమణాచార్యులు, జి. బస్వరాజు, లీలావతి, ఏ.సీ. నర్సయ్య తదితరులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుక సభ్యుల మధ్య ఆప్యాయతను మరింత బలపరిచింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి. నాగభూషణం, యూనిట్ ప్రధాన కార్యదర్శి చ. రాములు, మధుసూదన శర్మ, బుచ్చిరెడ్డి, విఠలాచారి, బాపురావు, శంకర్, శంకరంగౌడ్, పోచయ్య, ప్రవీణ, సుగుణ, హైమావతి, శంకరయ్య, సంగప్ప, కే.ఎల్. రవీందర్, విఠల్ మల్లేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.సమావేశం ముగింపులో సంఘాన్ని మరింత బలోపేతం చేసి, విశ్రాంత ఉద్యోగుల హక్కుల కోసం కృషి చేయాలని సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు.

# ప్రైవేటు ఆసుపత్రుల్లో పేదలతో తక్కువ ఫీజులు తీసుకోవాలి

**డాక్టర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి)**




జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు డాక్టర్లు కృషి చేయాలని, నిబంధనల ప్రకారం బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల నేపథ్యాన్ని పురస్కరించుకొని బుధవారం సేఫ్ మదర్ హుడ్ (సురక్షిత మాతృత్వం) కార్యక్రమాలు నిర్వహించగా, జిల్లాలోని అన్ని వైద్యశాలల డాక్టర్లు, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ కావాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరం కాబట్టి ప్రజలకు అవగాహన కలిగేలా ప్రతి ఆసుపత్రిలో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఏటా పదివేలకు పైగా ప్రసవాలు జరుగుతుండగా ఇందులో సుమారు 5000 ప్రభుత్వ ఆసుపత్రిలలో జరుగుతున్నాయన్నారు. మిగిలిన వాటిలో 2500కు పైగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతుండగా, మరో 2500 పైగా ప్రసవాలు ఇతర ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. గర్భిణి స్త్రీల వివరాలు ఆయా ప్రాంతాల్లోనే ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు తెలుస్తుంది. కాబట్టి ప్రతి ఒక్క గర్భిణి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకునేలా పెద్ద ఎత్తున అవగాహన కలిగించాల్సి ఉందన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ, శస్త్ర చికిత్సల ప్రసవాలతో పాటు ఇతర వైద్య సేవలకు తీసుకునే ఫీజుల వివరాలతో ఆయా వైద్యశాలలలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరుపేద ప్రజలు వైద్యం కోసం తమ ఆసుపత్రులకు వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వారికి తక్కువ డబ్బులతో చికిత్స అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్టేజీ నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, వైద్యశాలల పరిసరాలు పరిశుభ్రతతో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

టీబి స్క్రీనింగ్ లో జోగులాంబ గద్వాల జిల్లా వెనుకబడిందని, క్షయ రోగులకు ప్రభుత్వం నుంచి అందే సహకారాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలన్నింటిలోనూ ప్రైవేట్ వైద్యశాలల యాజమాన్యాలు కూడా పాలుపంచుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి వివరించారు. అనంతరం సేఫ్ మదర్ హుడ్, గృహ ఆధారిత నవజాత శిశు సంరక్షణ, తదితర అంశాలపై ముద్రించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్యాధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, ప్రోగ్రాం అధికారులు ప్రసూన రాణి, రాజు, ఇతర వైద్యాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు ఆశీస్సులు

**ఆడపడుచు పెళ్లి కానుక – ₹10,116**

**రాచూరు గ్రామ సర్పంచ్ గున్నెల శ్రీనివాస్**

**వెల్దండ ఏప్రిల్ 8 (వుదయం))**

మండల పరిధిలో రాచూరు గ్రామ సర్పంచ్ గున్నెల శ్రీనివాస్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నారు బుధవారం రాచూరు గ్రామానికి చెందిన దుబ్బ రాములు సాయమ్మ దంపతుల రెండవ కుమార్తె మమత పెళ్లికి కానుకగా 10116 రూపాయలు పెళ్లి పందిరి క్రింద కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సురేష్‌రెడ్డి, గంగ దారి రమేష్, గంగాధరి శ్రీనివాస్, మదార్, వెంకోబా, అర్జున్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు పెళ్లికి ఆసరా అయిన సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు

# కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు ముమ్మరం



**ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**కోరుట్ల ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి)**

కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపారు బుధవారం ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు వచ్చే వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి భీమారం కథలాపూర్ మండలాల రైతులకు సాగు త్రాగునీటి అవసరాలను తీర్చే కీలక ప్రాజెక్ట్ అయిన కలికోట సూరమ్మ చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా కొ న సా గు తు న్నా య న్నా రు పనుల అమలు పర్యవేక్షణకు ప్రతి 11 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు ఈ సమావేశాల్లో పనుల పురోగతి ఎదురవుతున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై చర్చించి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సుమారు 43 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు దీంతో ప్రాంతీయ రైతులకు భారీగా లాభం చేకూరనుంది ఇప్పటికే ప్రాజెక్ట్‌కు సంబంధించిన కుడి ఎడమ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని త్వరలోనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో పాటు ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు

తదితరులు పాల్గొన్నారు

# నర్సిములుకు కాంగ్రెస్ పార్టీ అండ పరామర్శించిన మండల అధ్యక్షులు

- **హన్మంత్ రావు పాటిల్అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్**

**జహీరాబాద్ ఏప్రిల్ 8 (వుదయం)**



ఝరాసంగం*: మండలంలోని ఝరాసంగం గ్రామానికి చెందిన రిపోర్టర్ రాయికోటి నర్సిములు ఇటీవల బాత్ రూమ్ లో కాలు జారి పడిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకొని బుధవారం నాడు జహీరాబాద్ పట్టణం లోని జర్నలిస్ట్ కాలనీ లో ఇంటికి వెళ్లి పరామర్శించిన ఝరాసంగం మండల పెద్దలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయి కోటి నర్సిములు తర్వాగా కోలుకోవాలని.మంచి ఆరోగ్యం తో బయటకు రావాలని కోరుతున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంగ్రామ్ పాటిల్ దప్పూర్ సంగమేష్, వేణుగోపాల్ రెడ్డి, ఆన్సర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి కృషితోనే అగ్రగామిగా దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి



**దుబ్బాక ఏప్రిల్ 8 (వుదయం)**

:అందరి కృషితోనే దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించి రాష్ట్రంలో ఉత్తమ స్థాయిలో నిలపడం జరిగిందని సూపరిండెంట్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్ అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల సిబ్బంది సహకారంతో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి మూడు రకాల అవార్డులు రావడం జరిగిందన్నారు. ఆసుపత్రిలోని శానిటేషన్, ఆరోగ్య మిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బందితో పాటు ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది సహకారంతో రాష్ట్రంలో ఉత్తమ సేవలు అందించి మూడు అవార్డులను గెలుచుకోవడం జరిగిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న రాజకీయ నాయకులకు, మీడియా మిత్రులకు, వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మరింత సహకరిస్తే మోకాళ్ళ చిప్పల మార్పిడితో పాటు కంటి ఆపరేషన్లు ఆస్పత్రిలో చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



“ఇరాన్ కు సైనిక ఆయుధాలు సరఫరా చేస్తున్న ఏ దేశమైనా ఎటువంటి మినహాయింపు లేకుండా తక్షణమే 50 శాతం టారిఫ్ లను భరించవలసి ఉంటుంది. ఇరాన్ లో ఇక ముందు యురేనియం శుద్ధి కార్యక్రమం జరగబోదు. – డోనాల్డ్ ట్రంప్, అమెరికా రక్షణ మంత్రి.

ఇరాన్ పై సాగించిన ‘ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ’(ఐతిహాసిక బీభత్సం) యుద్ధంలో అమెరికా ఘనమైన సైనిక విజయం సాధించింది. కాల్పుల విరమణ కోసం ఇరాన్ మా కాళ్ళు పట్టుకున్నది. దాని క్షిపణి నిర్మాణ కార్యక్రమాన్ని ధ్వంసధూళి చేశాము. అది ఇక ఎంతమాత్రం కార్యరంగంలోకి అడుగుపెట్టజాలదు. ఇరాన్ రక్షణ పరిశ్రమ పునాదులను కదిలించాము. ఒక్క మంగళవారం (ఏప్రిల్ 7, 2026) రాత్రే ఇరాన్ పై అమెరికా 800 దాడులు చేసింది. దాని పరిశ్రమలు నేలమట్టం అయ్యాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ స్పృహ కోల్పోయాడు. తీవ్రంగా గాయపడ్డాడు. వికలాంగుడయ్యాడు.
– అమెరికా రక్షణ మంత్రి పేటే హెగ్సెత్.”

## వే'మన'పద్యం

**ఆశచేత మనుజు లాయువు గలనాళ్ళు**
**తిరుగుచుంద్రు భ్రమను ద్రిప్పలేక**
**మురికిభాండమందు ముసరునీగల భంగి**
**విశ్వదాభిరామ వినురవేమ.**



## సంపాదకీయం

# పశ్చిమాసియాలో కాల్పుల విరమణ!

ఒక మహా నాగరకతను నేలమట్టం చేయడం, ఇరాన్‌ను నామరూపాలు లేకుండా తుడిచిపెట్టడం అనే అమానుష, క్రూరాతి క్రూర మృగ హెచ్చరికలకు ప్రస్తుతానికైతే తెర పడింది. ఇది ప్రపంచమానవాళి ఎంతైనా హర్షించవలసిన మేలు.ప్రపంచానికి చెప్పనలవి కాని చమురు, గ్యాస్ సంక్షోభాన్ని , ఆర్థిక కల్లోలాన్ని దాపురింపజేసిన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం మరొక మానవీయ పరిణామం.రెండు వారాలపాటు కాల్పుల విరమణ పాటించడానికి అంగీకారం కుదిరినట్టు అమెరికా, ఇరాన్ ప్రకటించడం చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెర లేపింది. ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని మాన్పించడం కోసం ఒకవైపు దానితో చర్చలు సాగిస్తూనే అటు నుంచి ఎటువంటి కవ్వింపు లేకుండానే ,దాని మీదకు అమెరికా ఇజ్రాయెల్ లు జమిలిగా విరుచుకుపడ్డాయి.చిన్నప్పుడు చదువుకున్న కథలో పులి లేగను కబళించడానికి నేను వాగు పైన నీళ్లు తాగుతుంటే నీ తల్లి దిగువన దాహం తీర్చుకున్నదని సాకు అయినా చెప్పింది గాని, ఇక్కడ అమెరికా, ఇజ్రాయెల్ లు అటువంటి నెపాన్ని కూడా చూపకుకుండా ఇరాన్ పై అగ్ని వర్షం కురిపించడం మొదలు పెట్టాయి. శత్రువును కాళ్లబేరానికి రప్పించుకోడమే తమ ధ్యేయమని, ఇరాన్ ను చావగొట్టి చెవులు మూసి లొంగదీసుకొనంతవరకు ఆగబోమని ప్రకటించుకొని యుద్ధరంగంలో ప్రవేశించిన అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం 39 రోజులు సాగినా ఆ లక్ష్యాన్ని సాధించలేక, కాల్పుల విరమణ కు అంగీకరించడం గమనించవలసిన అంశం. ఇరాన్ తనవద్ద గల స్వల్ప వ్యయంతో కూడిన డ్రోన్లతో నిలకడగా ప్రతిఘటించడం అమెరికాను ఇజ్రాయెల్‌ను గంగ వెర్రులెత్తించిందనడం అతిశయోక్తి కాదు.

వాస్తవానికి వారం, పది రోజుల ముందునుంచే ట్రంప్ రణ రంగానికి దూరమవుతూ వచ్చాడు. చివరి సారి హెచ్చరించి చూద్దామని 48 గంటల గడువిచ్చి వెనక్కి తగ్గి కాల్పులవిరమణకు అంగీకరించాడు. ఏక పక్షంగా ఇరాన్ పై దాడులు జరిపి ఎప్పటికీ యుద్ధాన్ని విరమించనందుకు ట్రంప్ మీద అమెరికన్ల లో ఆగ్రహ అసంతృప్తులు ఆకాశాన్ని అంటుతున్నాయి.రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనే గాకుండా ఆ పైన కరిగే అధ్యక్ష ఎన్నికల్లోనూ ట్రంప్ కి చెందిన రిపబ్లికన్ పార్టీ ఘోర ఓటమి చెందడం ఖాయమంటున్నారు .అందువల్ల వచ్చే 14 రోజుల్లో జరగబోయే చర్చల్లో అమెరికా నిర్మాణాత్మక పాత్ర పోషించి శాశ్వత శాంతికి దోహదపండగలదని కోరుకుందాము.యుద్ధంలో అమెరికా ఇజ్రాయెల్ లు ఎన్నో నేరాలకు పాల్పడ్డాయి. మొదటి రోజే ఇరాన్ లోని ఒక బాలికల పాఠశాలపై దాడికి పాల్పడి 150 మందికి పైగా చిన్నారులను పొట్టన బెట్టుకున్నాయి. భారత్ నుంచి తిరిగి వస్తున్న ఇరాన్ సైనిక నౌకను ముంచివేసి యుద్ధ రంగం బయట కూడా అవి తమ ప్రతాపాన్ని చాటాయి. ఇరాన్‌లో అత్యధికంగా 3500 మంది మరణించారు. ఇందులో బాలలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఎంతో సంపదను, సైనిక ఆస్తులను ఇరాన్ కోల్పోయింది. చర్చల్లో అన్ని విషయాలపైన హేతుబద్ధ ఆలోచనలతో నిర్ణయాలు తీసుకోవాలి. అదే పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారి వేస్తుంది. ఇంకా ఆగకుండా లెబనాన్ పై రెచ్చిపోతున్న ఇజ్రాయెల్ ను అమెరికాయే దారికి తేవాలి. కారణాలు ఏమైనప్పటికీ పాకిస్థాన్‌తో మన సంబంధాలు ఎటువంటివి అయినప్పటికీ ఈ కాల్పుల విరమణ సాధించడంలో పాక్ వహించిన కీలక పాత్రను హర్షించడంలో తప్పులేదు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## ధర్మో రక్షతి రక్షితః

# నాడు కురుక్షేత్రం.. నేడు ప్రజాక్షేత్రం!



ధర్మో రక్షతి రక్షితః ధర్మాన్ని మనం కాపాడితే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది. ఇది తరతరాలుగా మన రక్తంలో ప్రవహిస్తున్న సూక్తి. కానీ, అట్టహాసంగా సాగుతున్న నేటి రాజకీయ రణక్షేత్రంలో అసలు ధర్మం ఎవరి వైపు నిలబడింది? ఏది సత్యం, ఏది అసత్యం అని తేల్చుకోలేనంతగా రాజకీయం రంగులు మార్చుకుంది.వేదవ్యాసుడు అందించిన మహాభారతం కేవలం ఒక పాతకాలపు పురాణగాథ మాత్రమే కాదు. అది మానవ నైజానికి, అధికార దాహానికి, సత్యానికి మరియు మోసానికి మధ్య యుగయుగాలుగా సాగుతున్న ఒక శాశ్వత సంఘర్షణకు నిలువుటద్దం. ఈనాడు మన దేశ రాజకీయ యవనికపై కళ్ళు తెరిచి చూస్తే, క్రీస్తు పూర్వం నాటి హస్తినాపురపు రాజదర్బారు కళ్ళ ముందు కదలాడుతున్నట్లు అనిపించక మానదు. కాలం మారింది, వేషధారణలు మారాయి, వేదికలు డిజిటల్ అయ్యాయి కానీ అధికారం కోసం సాగే ఆ కుతంత్రాల కథ మాత్రం అక్షరం పొల్లు పోకుండా అదే నడక నడుస్తోంది.మహాభారతంలో ధృతరాష్ట్రుడు పుట్టుకతోనే అంధుడు. అయితే, ఆయన శారీరక అంధత్వం కంటే తన కుమారులపై ఉన్న అచంచలమైన గుడ్డి ప్రేమ కౌరవ వంశ పతనానికి పునాది వేసింది. తన కొడుకులు చేస్తున్న అకృత్యాలు తెలిసినా, రాజ్యాన్ని అన్యాయంగా ఆక్రమిస్తున్నారని అర్థమైనా, పుత్రవాత్సల్యంతో కళ్ళు మూసుకున్నాడు.నేటి రాజకీయ దృశ్యం దీనికి భిన్నంగా ఏమీ లేదు. పదవీ మోహం, కుటుంబ రాజకీయాల మత్తులో సామాన్యుడి కష్టాలు వీరికి కనిపించడం లేదు. ఎన్నికల వేళ జనాల ముంగిటకు వచ్చి సాగిలపడి, ముద్దులు పెట్టి, హామీల వర్షం కురిపించే నాయకులు అధికారం చేపట్టిన మరుక్షణమే అదే జనాన్ని మరిచిపోవడం, తమ వారసుల సామ్రాజ్య విస్తరణలో మునిగిపోవడం ఇది ధృతరాష్ట్రుని ఆధునిక రూపం కాదా? ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులు అనుకుంటాం, కానీ తెర వెనుక మాత్రం వారసత్వ ధృతరాష్ట్రులు చక్రం తిప్పుతూనే ఉన్నారు.

దుర్యోధనుడు బలవంతుడు, సమర్థుడు, గొప్ప యోధుడు. కానీ, అతని పతనానికి కారణం అతనిలోని అంతులేని అహంకారం మరియు ఇతరుల హక్కుల పట్ల ఉన్న అసూయ. సూది మొన మోపినంత భూమిని కూడా ఇవ్వను అన్న అతని మొండితనం కురుక్షేత్రానికి దారితీసింది.నేటి రాజకీయ రంగంలో ఇలాంటి దుర్యోధన ప్రవృత్తులు అడుగడుగునా కనిపిస్తాయి. నా మాటే శాసనం కావాలి, నా పార్టీయే అధికారంలో ఉండాలి, నా కనుసన్నల్లోనే వ్యవస్థలు నడవాలి అనుకునే ధోరణి పెచ్చుమీరుతోంది. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రజాధనాన్ని కుమ్మరించడం, సంక్షేమం పేరుతో ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రత్యర్థులను రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా బలహీనపరచడం వంటివి నేటి దుర్యోధన వ్యూహాలు . నాడు గదను పట్టుకుని యుద్ధం చేస్తే, నేడు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులపై దాడులు చేస్తున్నారు. నీతి, నియమం కంటే గెలుపు మాత్రమే పరమావధిగా మారిన వేళ, ధర్మం మూల పడి రోదిస్తోంది.

> **మరోవైపు భీష్మ పితామహుడు, ధర్మం ఎటుందో తెలిసినా, రాజ్యానికి కట్టుబడి ఉన్నాననే సాకుతో అధర్మాన్ని చూస్తూ ఊరుకున్నాడు. నేడు మన వ్యవస్థల్లోని ఉన్నతాధికారులు, న్యాయకోవిదులు, మేధావులు కూడా కొన్నిసార్లు భీష్ముడిలాగే మౌనం వహిస్తున్నారు. అధికారం చేసే అరాచకాలను ప్రశ్నించకపోవడం కూడా ఒక రకమైన అపరాధమే. ఈ మౌనం అధర్మానికి బలాన్ని ఇస్తోంది.కథ ఎంత భయంకరంగా ఉన్నా, చివరికి గెలిచేది ధర్మమే అని మహాభారతం చెబుతుంది. ఆ ధర్మాన్ని గెలిపించడానికి శ్రీకృష్ణుడు అవసరమయ్యాడు. మరి నేటి ప్రజాస్వామ్యంలో ఆ కృష్ణుడు ఎవరు? ఆ కృష్ణుడు మరెవరో కాదు.చైతన్యవంతుడైన సామాన్య ఓటరు. నాయకులు మారవచ్చు, పార్టీలు మారవచ్చు, కానీ మనం వేసే ఓటు ధర్మం వైపు ఉందా లేదా అని ఆలోచించుకోవాలి.**

శకుని ద్రోహానికి, కుట్రలకు, పాచికల మోసానికి పర్యాయపదం. కౌరవుల మనసుల్లో పాండవుల పట్ల విషాన్ని నూరిపోసి, వారితో జూదం ఆడించి, ద్రౌపది వస్త్రాపహరణానికి కారకుడైన సూత్రధారి అతను. మరి నేటి రాజకీయాల్లో శకునులు లేరా? అంటే, ప్రతి పార్టీలోనూ ఒకరు కాదు, ఒక సైన్యమే ఉంది.ప్రస్తుత కాలంలో వీరిని పొలిటికల్ స్ట్రాటజిస్టులు లేదా రాజకీయ వ్యూహకర్తలు అని పిలుస్తున్నాం. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసి, కులమత విద్వేషాలను రగిల్చి, ఓటు బ్యాంకును ఎలా దక్కించుకోవాలో వీరు నేర్పిస్తున్నారు. మీడియాను, సోషల్ మీడియాను తమకు అనుకూలంగా మార్చుకుని అసత్యాన్ని సత్యంగా నమ్మించడంలో వీరు దిట్టలు. ఒక నాయకుడి చెవిలో ప్రత్యర్థి గురించి విషం పోయడం, విభజన రాజకీయాలను ప్రోత్సహించడం ద్వారా సమాజాన్ని రెండు వర్గాలుగా విడగొట్టడం ఇవన్నీ ఆధునిక శకుని ఆడుతున్న జూదపు పాచికలే. ఈ పాచికల ఆటలో ఓడిపోతున్నది మాత్రం సామాన్య ప్రజానీకమే.మహాభారతంలో మనం చర్చించుకోవాల్సిన మరో రెండు ముఖ్యమైన పాత్రలు కర్ణుడు మరియు భీష్ముడు. కర్ణుడు గొప్ప దాత, వీరుడు. కానీ తప్పుడు పక్షాన నిలబడటం వల్ల తన ప్రాణాలను పణంగా పెట్టాల్సి వచ్చింది. అలాగే, నేటి రాజకీయాల్లో ఎందరో విద్యావంతులు, సమర్థులు అయిన నాయకులు ఉన్నారు. కానీ, వారు తమ పార్టీ అధిష్టానం చేసే తప్పులను ఎత్తిచూపలేక, తమ కృతజ్ఞత లేదా విధేయత అనే సంకెళ్లలో చిక్కుకుని మౌనంగా ఉంటున్నారు.

మరోవైపు భీష్మ పితామహుడు, ధర్మం ఎటుందో తెలిసినా, రాజ్యానికి కట్టుబడి ఉన్నాననే సాకుతో అధర్మాన్ని చూస్తూ ఊరుకున్నాడు. నేడు మన వ్యవస్థల్లోని ఉన్నతాధికారులు, న్యాయకోవిదులు, మేధావులు కూడా కొన్నిసార్లు భీష్ముడిలాగే మౌనం వహిస్తున్నారు. అధికారం చేసే అరాచకాలను ప్రశ్నించకపోవడం కూడా ఒక రకమైన అపరాధమే. ఈ మౌనం అధర్మానికి బలాన్ని ఇస్తోంది.కథ ఎంత భయంకరంగా ఉన్నా, చివరికి గెలిచేది ధర్మమే అని మహాభారతం చెబుతుంది. ఆ ధర్మాన్ని గెలిపించడానికి శ్రీకృష్ణుడు అవసరమయ్యాడు. మరి నేటి ప్రజాస్వామ్యంలో ఆ కృష్ణుడు ఎవరు? ఆ కృష్ణుడు మరెవరో కాదు.చైతన్యవంతుడైన సామాన్య ఓటరు. నాయకులు మారవచ్చు, పార్టీలు మారవచ్చు, కానీ మనం వేసే ఓటు ధర్మం వైపు ఉందా లేదా అని ఆలోచించుకోవాలి. ఉచితాల ఆశ చూపించే దుర్యోధనులకో, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంధులైన ధృతరాష్ట్రులకో, కుతంత్రాలు చేసే శకునులకో బాధ్యత అప్పగిస్తే మరో కురుక్షేత్రం తప్పదు. ధర్మాన్ని రక్షించడం అంటే కేవలం గుడికి వెళ్లడం కాదు, సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం. ధర్మో రక్షతి రక్షితః ఈ మాటను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, మన ఓటు ద్వారా, మన ఆలోచన ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం. అప్పుడే ఆ ధర్మం మనల్ని, మన భావి తరాలను రక్షిస్తుంది. ఆధునిక హస్తినాపురంలో శాంతి నెలకొనాలంటే, ప్రజలందరూ సత్యం వైపు నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది కేవలం రాజకీయ విశ్లేషణ కాదు, ఒక సామాజిక మేల్కొలుపు!



డా .సూర్యదేవర రామకృష్ణ
+91 9490754169

# రాజధాని నిర్మాణం సహజంగా ఉండాలి!

అమరావతిని రాజధానిగా ప్రకటించిన దగ్గర నుంచి వివాద అంశంగా కొనసాగుతూ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లును 28-3-2026న కూటమి ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం జరిపి బిల్లు ఆమోదం పొందింది. శాసన మండలి సమావేశం మాత్రం జరపలేదు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపగా, కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధాని బిల్లును 1-4-26 పార్లమెంట్ లో, 2-4-26న రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులో భూములు ఇచ్చిన రైతుల సమస్యలకు, రాజధాని ఎప్పుడు పూర్తిచేస్తారు, రాజధాని నిర్మాణానికి డబ్బులు ఎలా తెస్తారు తదితర ముఖ్యమైన సమస్యలను ప్రస్తావించలేదని, అలాంటి బిల్లును ఆమోదించలేమని రెండు సభలనుంచి వై సీ పీ వాకౌట్ చేసింది. రాజధాని నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో ఉంది. శాశ్వత రాజధాని అన్నది రాజ్యాంగంలో లేదు. ప్రభుత్వం రాజధాని మార్పు నిర్ణయం తీసుకోవచ్చు. అందుకు ఎదురయ్యే న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకోవాలి.

2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. విభజన చట్టం ప్రకారం 10 సంవత్సరాలు హైదరాబాదే ఏపీ రాజధానిగా ఉంటుంది. అసెంబ్లీ సమావేశాలు కూడా అక్కడే జరుపుకోవచ్చు. ఈలోపు ఏపీ రాజధాని నిర్మాణం చేసుకోవాలి. చంద్రబాబు ఎటువంటి కారణాలు చెప్పకుండా, హైదరాబాద్ రాజధాని హక్కును వదులుకుని ఏపీకి రావడం జరిగింది. రాజధాని ఎక్కడైతే బాగుంటుంది అనే సూచన చేయడానికి కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిషన్‌ను నియమించింది. కమిషన్ అనేక ప్రాంతాల్లో పర్యటించి నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అంద చేసింది. అందులో తన అభిప్రాయాలను వివరించింది.

శివరామకృష్ణన్ కమిషన్ నివేదికకు భిన్నంగా రాజధాని కోసం అనేక ప్రాంతాలు ప్రచారం చేయబడ్డాయి. చివరికి అమరావతిని రాజధానిగా టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. దీనిని ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు వ్యతిరేకించాయి. నాగార్జున యూనివర్శిటీ వద్ద రాజధాని నిర్మించాలనే అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. ఈ ప్రాంతం వివిధ పంటలు పండే సారవంతమైన పంట భూములు ఉన్న ప్రాంతం. రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుంచి 33 వేల ఎకరాలను ప్రభుత్వ భూములను చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంది. పెద్దఎత్తున చేపట్టిన భూ సేకరణను వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు వ్యతిరేకించారు. ఎక్కడ లేని విధంగా గొప్పగా రాజధాని నిర్మాణం చేస్తామని, అందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పారు. ఈ ఖర్చుపైన తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ప్రభుత్వం పక్కన పెట్టింది. ఐదు సంవత్సరాల చంద్రబాబు పాలనలో తాత్కాలిక సచివాలయం, ఒకటి, అర భవనాలు మాత్రమే నిర్మాణం జరిగాయి.

2019న జరిగిన సాధారణ ఎన్నికల్లో వై సిపి విజయం సాధించింది జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం పరిపాలన వికేంద్రీకరణ అంశాన్ని అంటే అమరావతి సచివాలయం, విశాఖపట్నం ఎగ్జిగ్యూటివ్ రాజధాని, కర్నూల్ ను న్యాయ రాజధానిగా వై సీపీ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. దీన్ని టిడిపి, జనసేన, బీజేపీ పార్టీలు వ్యతిరేకించాయి. చివరికి న్యాయస్థానం నిర్ణయం పరిధి లోకి రాజధాని సమస్య వెళ్లింది.

2024 సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తానని, అందుకు మరో 40 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ కోసం అప్పీల్ చేయగా, రైతాంగం స్పందించ లేదు. ఇంతకు ముందు భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వలేదని, వారి సమస్యలు పరిష్కరించలేదని, వారి సమస్యలు పరిష్కరించ కుండా భూములు ఇవ్వమంటే ఎలా ఇస్తామని రైతులు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజధానిలో నిర్మాణం జరిగేవి సచివాలయం, ఉద్యోగుల ఆఫీసులు, ఎమ్మెల్యే క్వార్టర్స్, రోడ్లు మాత్రమే. వీటికి వెయ్యి ఎకరాలకు మించి అవసరం లేదు ఇతరత్రా అవసరాలను దృష్టిలో పెట్టుకున్నా 5వేల ఎకరాలే చాలా ఎక్కువ. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఎందుకు భూములు ఇవ్వాలి. వేల కోట్ల రూపాయలు కలిగిన పరిశ్రమాధిపతులు, తమకు కావాల్సిన భూములు వారే కొనుగోళ్లు చేసుకోలేరా!

అమరావతి చట్టబద్ధ తీర్మానం అసెంబ్లీలో ప్రవేశపెట్టే లోపే, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు( మావిగన్) మధ్య గ్రోత్ రాజధాని అంశాన్ని జగన్మోహనరెడ్డి ముందుకు తెచ్చారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే 20 వేల ఖర్చుతో రాజధాని నిర్మాణ పూర్తి చేయవచ్చని, మంచి రాజధానిగా అభివృద్ధి చెందుతుందని విలేకరుల సమావేశంలో వివరించారు. ప్రజల్లో ఇది చర్చగా మారింది.

ప్రపంచంలోనే గొప్ప రాజధానిగా అమరావతి నిర్మిస్తామని, రెండు లక్షల కోట్ల దాకా ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం చెబుతూ ఉంది. అంత ఖర్చు పెట్టటానికి డబ్బులు ఎక్కడ ఉన్నాయని, అందుకు అప్పులు చేయాలి గదా, అసలే రాష్ట్రం అప్పుల్లో ఉంది గదా! అంత డబ్బు ఒకే ప్రాంతంలో ఖర్చుపెడితే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని అనేక మంది ఆర్థిక నిపుణులు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

రాజధాని అభివృద్ధి సహజంగా ఉండాలి. దానికి ఆనుకుని నగరం ఉండాలి. అందుబాటులో గ్రామాలు ఉండాలి.అన్ని రకాల రవాణా సౌకర్యం, అందుకు రహదారులు ఉండాలి. రాజధాని ప్రాంతంలో ఉండాలనుకునే వాళ్లు స్థలాలు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుంటారు. పరిశ్రమలు పెట్టే వారు అందుకు కావాల్సిన భూమి కొనుగోళ్లు చేసుకోవాలి. తాను ఏర్పాటు చేసే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయిస్తుంది. ఆ విధంగా రాజధాని విస్తరిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ రాజధాని నిర్మాణం ఇలాగే జరిగింది. అమరావతి ప్రాంతం అలాంటిది కాదు. మూడు పంటలు పండే సారవంతమైన భూములతో నిండిన కృష్ణానదీ తీర ప్రాంతం. ఇక్కడ రాజధాని ప్రకటించినా సహజ సిద్ధంగా అభివృద్ధి చెందే పరిస్థితి లేదు. ఈ ప్రాంతంలో ప్రజా నివాస సముదాయాలు ఏర్పాటు ముఖ్యం. ఆ పని ప్రభుత్వం చేయలేదు. ప్రజలతోనే సాధ్యం. ఈ ప్రాంతంలో ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి భూమి కావాలి. గత వై సీ పీ ప్రభుత్వ వేలాది మందికి ఆ ఇళ్ల స్థలాలు కేటాయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇళ్ల స్థలాల కేటాయింపును రద్దు చేసింది. రద్దు చేయకుండా ఉంటే, స్థలాలు పొందిన ప్రజలు ఇళ్లు కట్టుకునేవారు. భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు కేటాయించలేదు. సేకరించిన, సేకరించనున్న లక్ష ఎకరాల భూములను పరిశ్రమలకు కేటాయిస్తానని చెబుతున్నారు. అమరావతికి రవాణా సౌకర్యం కూడా సమస్యగా ఉంది.

తిరిగి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా రాజధాని పనులు నత్తనడకనే సాగుతున్నాయి. కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణం ఎలా పూర్తి చేస్తుంది. రెండు సంవత్సరాల్లో రాజధానిని పూర్తి చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు రాజధాని నిర్మాణం నిరంతరం జరిగే ప్రక్రియ అని మాట మార్చడం ద్వారా రాజధాని నిర్మాణ అనేది భేతాళ ప్రశ్నగా మారింది. రాజధాని సమస్య ప్రజల ప్రమేయం లేని పార్టీల మధ్య వివాదంగా మారింది.



“రాజధాని అభివృద్ధి సహజంగా ఉండాలి. దానికి ఆనుకుని నగరం ఉండాలి. అందుబాటులో గ్రామాలు ఉండాలి.అన్ని రకాల రవాణా సౌకర్యం, అందుకు రహదారులు ఉండాలి. రాజధాని ప్రాంతంలో ఉండాలనుకునే వాళ్లు స్థలాలు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుంటారు. పరిశ్రమలు పెట్టే వారు అందుకు కావాల్సిన భూమి కొనుగోళ్లు చేసుకోవాలి. తాను ఏర్పాటు చేసే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయిస్తుంది. ఆ విధంగా రాజధాని విస్తరిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ రాజధాని నిర్మాణం ఇలాగే జరిగింది. అమరావతి ప్రాంతం అలాంటిది కాదు. మూడు పంటలు పండే సారవంతమైన భూములతో నిండిన కృష్ణానదీ తీర ప్రాంతం. ఇక్కడ రాజధాని ప్రకటించినా సహజ సిద్ధంగా అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.”



బొల్లిముంత సాంబశివరావు
+91 9885983526

## హీరోలా..జీరోలా !

పక్షులు చీమల్ని మింగేస్తాయి..
చనిపోయిన పక్షిని చీమలు తింటాయి !

సంపాదన ఎన్నటికీ శాశ్వతం కాదు..
మన బతుకే ఒక తాత్కాలిక ప్రయాణం !

నేడు నీలో దాగిన యువశక్తి ..
వృద్ధాప్య ముడతల్లో బక్క చిక్కిపోతుంది !

చిట్టి జీవితంలో చిక్కుల బాధలే కాదు..
చమక్కుల తళుకుల తన్మయత్వాలుంటాయి !

నిశ్శబ్దం, చిరునవ్వులు తెలివైనవి..
అనేక సమస్యలకు అవే సరైన సమాధానాలు !

ఎవ్వరూ ఫర్ఫెక్ట్, పర్మనెంట్ కాకపోవచ్చు..
నకిలీ, మురికి మనసులు కాకపోతే సరి !

నీరు, ఎరువు లేకుండా మొక్క ఎదగదు..
వైఫల్య నొప్పులు పడకుండా సాఫల్యం పుట్టదు !

నీ బాధల్లో వెంట నీడలా నిలిచిన వారు..
నీ గెలుపు కోసం ఓడిన వారే అసలైన నేస్తాలు !

కాల పరిస్థితులే మనల్ని హీరోలను..
కాల మహిమే మనల్ని జీరోలను చేస్తుంది !

– మధుపాళీ
9949700037

**ఏప్రిల్ 8 బుధవారం నాటి వుదయం దిన పత్రిక సంపాదకీయ పేజీ (4)లో ప్రచురించిన 'గుండెచెదిరే గుండాల అరణ్య రోదన' వ్యాసం అసలు రచయిత ఫొటో కింద పొరపాటున చలసాని నరేంద్ర -9849569050 అని మరో సీనియర్ రచయిత పేరు ఫోన్ నెంబర్ ప్రచురితమయ్యాయి. ఈ వ్యాస రచయిత పేరు శ్యామ్ మోహన్ - 9440595858 అని గమనించగలరు.**
**- సం**



# జాతీయం-అంతర్జాతీయం



## హింసారహిత ఎన్నికలు: ఇసిఐ ప్రతిజ్ఞ

### ఎన్నికలు ఢిల్లీ నియంత్రణకు అతీతంగా జరపాలని టీఎంసి డిమాండ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (వుదయం) :** బుధవారం తృణమూల్ కాంగ్రెస్ బృందంఎన్నికల సంఘం మధ్య జరిగిన సమావేశంలో గందరగోళం నెలకొంది. ఐదు నిమిషాల పాటు జరిగిన సమావేశానంతరం ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. అనంతరం టిఎంసి రాజ్యసభ ఎంపి డెరిక్ ఓబ్రియాన్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖను తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు భాజపాతో సంబంధాలున్న నిర్దిష్ట ఉదంతాలను ఆయన ముందు లేవనెత్తామన్నారు. దీంతో ఎన్నికల సంఘం అధికారి ఆగ్రహంతో తమను సమావేశం నుంచి బయటకు వెళ్లిపొమ్మన్నారని ఆరోపించారు. ఇసిఐ మాటలకు స్పందిస్తూ, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ఢిల్లీ నియంత్రణకు, రాజకీయ పక్షపాతానికి, ఎంపిక చేసిన వారిని లక్ష్యంగా చేసుకోవడానికి, ద్వంద్వ ప్రమాణాలకు అతీతంగా నిర్వహించాలని మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాము ఎన్నికల సంఘంతో నిష్కర్షగా, సూటిగా మాట్లాడామని ఎక్స్ వేదికగా టిఎంసి పేర్కొంది.

సమావేశం వీడియో లేదా ఆడియోను విడుదల చేయాలని ఆయన కమిషన్‌కు





సవాలు విసిరారు. విలేకరుల సమావేశంలో ఓబ్రియన్ మాట్లాడుతూ, తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ వద్దకు వెళ్ళామని, సమావేశం ప్రారంభమైన 7 నిమిషాలలోపే ఆయన మమ్మల్ని ఇక్కడి నుండి వెళ్ళిపోండి అని చెప్పారన్నారు. సమావేశం ఉదయం 10:02 గంటలకు ప్రారంభమై 10:07 గంటలకు ముగిసిందని వివరించారు. మీరు అధికారులను బదిలీ చేస్తున్నారని, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలను ఎలా నిర్వహించాలనుకుంటున్నారని మేం ఆయనను అడిగినప్పుడు, ఇక్కడి నుండి వెళ్ళిపోండి అని ఆయన అన్నారు. ఇది సిగ్గుచేటైన విషయం. నేడు జరిగిన దానికి సంబంధించిన వీడియో లేదా ఆడియోను విడుదల చేయాలని నేను ఎన్నికల కమిషన్‌కు సవాలు విసురుతున్నాను అని ఆయన అన్నారు.

భారతదేశంలోనే లోక్‌సభ, రాజ్యసభలలో తొలగింపు నోటీసులు ఎదుర్కొన్న ఏకైక ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నిలిచినందుకు మా సహచరులలో ఒకరు ఆయనను అభినందించారు. ఈ అంశంపైనే నేటి సాయంత్రం 4 నుండి 4:30 గంటల మధ్య, భావసారూప్యం కలిగిన బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ కలిసి ఒక విలేకరుల సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి, అని ఆయన అన్నారు.

కాగా, ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఎన్నికల సంఘం ప్రాంగణంలో నినాదాలు చేయడం, అనుచిత ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, హుందాతనాన్ని పాటించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, టిఎంసి ఎంపీ డెరెక్ ఓబ్రియన్‌ను కోరారు.

బుధవారం ఉదయం, 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు భయం, హింసకు తావు లేకుండా జరుగుతాయని ఇసిఐ స్పష్టం చేసింది. తృణమూల్ కాంగ్రెస్‌కు ఇసిఐ నుంచి సూటి హెచ్చరిక, ఈసారి పశ్చిమ బెంగాల్‌లో జరిగే ఎన్నికలు కచ్చితంగా భయం లేకుండా, హింస లేకుండా, బెదిరింపులు లేకుండా, ప్రలోభాలు లేకుండా, అలాగే ఎటువంటి దాడులు, బూత్ జామింగ్, సోర్స్ జామింగ్ లేకుండా జరుగుతాయి అని ఎక్స్‌పై పోస్ట్ చేసింది. 294 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీకి పోలింగ్ ఎటువంటి భయం లేదా హింస లేకుండా నిర్వహించనున్నట్టు ఇసిఐ పునరుద్ఘాటించింది.

**ఎన్నికల సంఘంపై ఆప్ విమర్శలు**

ఇదిలా ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల సంఘం పోస్ట్‌ను విమర్శించారు. ఎన్నికల సంఘం నేరుగా బీజేపీ నుండి ఆదేశాలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘం బీజేపీ ఆధ్వర్యంలో పనిచేస్తోందని, ఆ పార్టీ నుంచే నేరుగా ఆదేశాలు స్వీకరిస్తోందని ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైపోయింది, ఇది అత్యంత దురదృష్టకరం. కనీసం, ఇటువంటి భాషలో ట్వీట్ చేయడం ద్వారా, ఇంతటి కీలకమైన సంస్థ ప్రతిష్టను బహిరంగంగా మంటగలిపేయకండి, అని కేజ్రీవాల్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో జరగనుంది, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

## తమిళనాడు ప్రధాన కార్యదర్శి బదిలీ

**చెన్నై, ఏప్రిల్ 8 (వుదయం) :** ఈనెల 23న తమిళనాడు శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందాన్ని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎం. సాయి కుమార్ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమించారు. సాయికుమార్ గతంలో తమిళనాడు న్యూస్‌ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ్ (టీఎన్‌పీఎల్) ఛైర్మన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి ప్రైవేట్ సెక్రటరీగా కూడా పనిచేశారు. ఈ ఉత్తర్వును తక్షణమే అమలు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశం జారీ చేసింది.

అంతేకాకుండా, తమిళనాడు సాయుధ పోలీసులు, విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సేవలందించిన డేవిడ్ సన్ ఆశీర్వాదం బదిలీ అయ్యారు. విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ, తమిళనాడు సాయుధ పోలీసులకు కొత్త డిజిపిగా ఐపిఎస్ అధికారి సందీప్ మిట్టల్ నియమితులయ్యారు. దీనికి ముందు, ఏప్రిల్ 2న, తమిళనాడు పోలీస్ శాఖకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సందీప్ రాయ్ రాథోర్ అప్పటికే నియమితులయ్యారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో ఎన్నికల సంఘం చురుకుగా నిమగ్నమై ఉంది.

## యురేనియం శుద్ధికి నో : ట్రంప్

### సుంకాలు, ఆంక్షల సడలింపుపై ఇరాన్‌తో అమెరికా చర్చిస్తుంది

**వుదయం డెస్క్, ఏప్రిల్ 8 :** యురేనియం శుద్ధి చేయడానికి టెహ్రాన్‌ను అనుమతించబోమని, భూగర్భంలో పాతిపెట్టిన అణు ధూళిని తొలగించడానికి వాషింగ్టన్, ఇరాన్‌తో కలిసి పనిచేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అన్నారు. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేసే దేశాలపై 50% సుంకాలు విధిస్తామని కూడా ఆయన హెచ్చరించారు.

ఇరాన్‌లో తాను ఫలవంతమైన పాలన మార్పు జరిగిందని అభివర్ణించిన అనంతరం, వాషింగ్టన్ టెహ్రాన్‌తో కలిసి పనిచేస్తుందని ట్రంప్ ట్రూత్ సోషల్‌పై తన తాజా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ చర్చల్లో సుంకాలు, ఆంక్షల సడలింపు అంశాలు కూడా భాగంగా ఉండవచ్చని ఆయన వివరించారు.

అయితే, అక్కడ యురేనియం శుద్ధి ప్రక్రియ ఏదీ జరగదు. అంతేకాదు, అమెరికా ఇరాన్‌తో కలిసి పనిచేస్తూ, లోతుగా పాతిపెట్టిన అణు 'ధూళిని (బి2 బాంబర్లు) మొత్తాన్ని వెలికితీసి నిర్వీర్యం చేస్తుందని ఆయన రాశారు.

ఉపగ్రహ నిఘా ద్వారా అమెరికా ఆ ప్రదేశాలను నిశితంగా పర్యవేక్షిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాక, దాడి జరిగిన తేదీ నుంచి అక్కడ ఉన్న ఏ వస్తువునూ ఎవరూ తాకలేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ చర్చలలో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా ఒక భాగంగా ఉండే అవకాశం ఉందని ట్రంప్ సూచించారు. మేం ఇరాన్‌తో సుంకాలు, ఆంక్షల సడలింపుల గురించి చర్చిస్తున్నాం. భవిష్యత్తులోనూ చర్చిస్తాం. ఆ 15 అంశాలలో చాలా వాటిపై ఇప్పటికే ఏకాభిప్రాయం కుదిరింది, అని ఆయన తెలిపారు.



తదుపరి పోస్ట్‌లో, ఇరాన్‌కు సైనిక ఆయుధాలను సరఫరా చేస్తున్న దేశాలను అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. ఆ దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 50 శాతం సుంకం విధిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇరాన్‌కు సైనిక ఆయుధాలను సరఫరా చేసే ఏ దేశంపై అయినా సరే, ముఖ్యంగా ఆ దేశం అమెరికాకు విక్రయించే ఏ ఒక్క వస్తువుపై అయినా, అన్ని వస్తువులపై తక్షణమే 50 శాతం సుంకం విధిస్తాం. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. ఇందులో ఎటువంటి మినహాయింపులు లేదా వెసులుబాట్లు ఉండవు! అని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్ తాజా వ్యాఖ్యలపై ఇరాన్ ఇంకా స్పందించలేదు.

పాకిస్తాన్‌లో జరుగనున్న చర్చల ముందు తాజా వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ వారంలో యుఎస్, ఇరాన్ చర్చలకు పాక్ ఇస్లామాబాద్‌లో ఆతిథ్యమిస్తుందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్న విషయం తెలిసిందే. ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్న పాక్, పొరుగున ఉన్న ఇరాన్‌పై కూడా ప్రభావాన్ని కలిగి ఉండటంతో టెహ్రాన్ వాషింగ్టన్ మధ్య కీలక వార్తాహరుడి పని చేసింది.

ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలను ధ్వంసం చేస్తామన్న ట్రంప్ గడువు ముగియడానికి కేవలం గంట ముందు, టెహ్రాన్, వాషింగ్టన్‌లు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నాయకుడు మరణించడంతో ఈ సంఘర్షణ ప్రారంభమైంది. దీనికి ప్రతిగా ఇరాన్ గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ పై దాడులు చేసింది. ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా దాడులు ప్రారంభించడంతో లెబనాన్ కూడా ఈ వివాదంలో చిక్కుకుంది. దీనికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులతో స్పందించింది.

లెబనాన్‌తో సహా ప్రతిచోటా కాల్పుల విరమణ వర్తిస్తుందని షరీఫ్ చెప్పినప్పటికీ, అక్కడ హిజ్బుల్లా మిలిటెంట్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తన కార్యకలాపాలను కొనసాగిస్తుందని ఆ దేశ నాయకులు సూచించారు.

## మమత నామినేషన్ దాఖలు



**కోల్‌కత, ఏప్రిల్ 8 (వుదయం):** ఒకవైపు ఎన్నికల కమిషన్‌తో యుద్ధం, విశ్వసనీయ అధికారుల బదిలీ, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఈసారి బెంగాల్‌లో తృణమూల్ గెలుపు నల్లేరు మీద నడక కాదని అనిపించేలా చేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోలాహలంగా భవానీపూర్ లో బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఆమె స్వంత నియోజకవర్గం నుంచి ఆమె నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు ఆమె వెంట ఉన్నారు. నామినేషన్ వేసేందుకు వెడుతూనే కాలీఘాట్ నుంచి అలీపోర్ సర్వే బిల్డింగ్ వరకు మమత రోడ్ షో నిర్వహించారు. భారీ సంఖ్యలో ఆమె మద్దతుదారులు ఇందులో పాల్గొని, ఆమెకు అభివాదం చేస్తూ, అనుకూలంగా నినాదాలు చేశారు, రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

నామినేషన్ పత్రాల సమర్పణ తర్వాత మాట్లాడుతూ, తాను పుట్టింది, పెరిగింది భవానీపూర్‌లోనేనని, తన జీవితంలో ప్రతీదీ ఇక్కడి నుంచే ప్రారంభమైందని మమతా బెనర్జీ చెప్పారు. భవానీపూర్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు టీఎంసీకి ఓటు వేయాలని కోరారు. 294 సీట్లలోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించి అతి పెద్ద విజయాన్ని చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల జాబితాలో అనేక మంది పేర్లను తొలగించడం తనకు బాధ కలిగిస్తోందని, ఓటర్ల తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో అర్థం కావడం లేదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

**మమత వెర్సస్ సువేందు**

ఇలా ఉండగా, భవానీపూర్ నియోజవర్గం నుంచి మమతా బెనర్జీ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నాలుగోసారి పోటీలో ఉన్న మమతా బెనర్జీపై బీజేపీ తమ అభ్యర్థిగా సువేందు అధికారిని పోటీలోకి దింపింది. 294 మంది సభ్యుల పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

### కాల్పుల విరమణ తర్వాత

## జలసంధి గుండా 2 నౌకలు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 8:** కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరిస్తున్నట్టు ప్రకటించినప్పటి నుంచి దాని గుండా రెండు నౌకలు దాని ద్వారా ప్రయాణించాయని సముద్రయాన పర్యవేక్షక సంస్థ మెరైన్ ట్రాఫిక్ బుధవారం వెల్లడించింది.

"గ్రీకు యాజమాన్యంలోని బల్క్ క్యారియర్ ఎన్‌జె ఎర్త్ 08:44 యుటిసి వద్ద జలసంధిని దాటగా, లైబీరియా జెండా కలిగిన డేటోనా బీచ్ 05:28 యుటిసికి బందర్ అబ్బాస్ నుంచి నుండి బయలుదేరిన కొద్దిసేపటికే, 06:59 యుటిసి వద్ద సంధి గుండా ప్రయాణించింది" అని మెరైన్ ట్రాఫిక్ ఎక్స్ లో పోస్ట్ చేసింది.

మంగళవారం అర్థరాత్రి తర్వాత అమెరికా, ఇరాన్‌లు రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఈ సమయంలో హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణం ఇరాన్ సాయుధ దళాల సమన్వయంతో సాధ్యమవుతుందని ఇరాన్ విదేశాంగ



మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్‌పై పోస్ట్ చేశారు. ఎన్‌జె ఎర్త్ రవాణా అనేది కదలికకు ఒక తొలి సంకేతం కావచ్చు, కానీ ఇది విస్తృతమైన కాల్పుల విరమణ ఆధారిత పునఃప్రారంభాన్ని ప్రతిబింబిస్తుందా లేక గతంలో ఆమోదించిన మినహాయింపా అని చెప్పడానికి ఇంకా చాలా తొందరపాటు అవుతుందని మెరైన్‌ట్రాఫిక్ యజమాని క్లెప్లర్ విశ్లేషకురాలు అనా సుబాసిక్ ఏఎఫ్‌పీకి తెలిపారు.

గ్రీకు యాజమాన్యంలోని ఆ నౌక, గత మూడు వారాలుగా ఈ జలమార్గాన్ని దాటుతున్న చాలా నౌకలు ఉపయోగిస్తున్న, లారాక్ ద్వీపం సమీపంలోని ఇరాన్ ఆమోదించిన మార్గం గుండా జలసంధిని దాటుతున్నప్పుడు తన ట్రాన్స్‌పాండర్ సిగ్నల్‌ను ఆన్‌లోనే ఉంచింది. ఆ నౌక గమ్యస్థానాన్ని ఏఎఫ్‌పీ వెంటనే నిర్ధారించలేకపోయింది. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయాణాలు జరుగుతాయని మేము భావిస్తున్నప్పటికీ, రిస్క్, నిబంధనల పరంగా చూస్తే, ఈ మొదటి ప్రయాణాన్ని జాగ్రత్తగా పరిగణించాలి, అని సుబాసిక్ వివరించారు.

గల్ఫ్‌లో చిక్కుకుపోయిన తమ నౌకలను తరలించడానికి కొంతమంది నౌకా యజమానులు, చార్టర్డ్ నౌకలు గలవారు సిద్ధమవుతున్నారని షిప్పింగ్ జర్నల్ లాయిడ్స్ లిస్ట్ బుధవారం ఉదయం నివేదించింది. ప్రస్తుతం గల్ఫ్‌లో సుమారు 800 నౌకలు చిక్కుకుపోయాయని అది అంచనా వేసింది.

ఫిబ్రవరి 28 నుండి అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా, ఇరాన్ ఈ జలసంధిలో రాకపోకలను తీవ్రంగా నియంత్రించింది. కెప్లర్ గణాంకాల ప్రకారం, మార్చి 1 నుండి ఏప్రిల్ 7 మధ్య కాలంలో సరుకు రవాణా నౌకలు 307 సార్లు ఈ మార్గాన్ని దాటాయి; ఇది శాంతికాలంలో ఉండే సాధారణ రద్దీతో పోలిస్తే 95 శాతం తగ్గుదల. శాంతికాలంలో, ప్రపంచ ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)లో సుమారు ఐదవ వంతు ఈ జలమార్గం గుండా ప్రవహిస్తుంది.

## హార్ముజ్ దాటడానికి సుంకాలు విధించలేం



- ఒమన్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 10 :** ఇరాన్ తన 10సూత్రాల కాల్పుల విరమణ ప్రతిపాదనలో, హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే ఓడలపై టెహ్రాన్, మస్కట్ రెండూ రవాణా సుంకం/రుసుము విధించడానికి అనుమతించే ఒక నిబంధనను చేర్చింది. అయితే, ఇరాన్ డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ, హార్ముజ్ దాటడానికి ఎటువంటి సుంకాలు విధించలేము, అని ఒమన్ పేర్కొంది. ఒమన్ రవాణా శాఖ మంత్రి ప్రకారం, హార్ముజ్ జలసంధిని దాటే ఓడలపై ఎలాంటి రుసుములు విధించమని హామీ ఇచ్చే ఒప్పందాలపై సుల్తానేట్ సంతకాలు చేసింది. ఈ వ్యూహాత్మక కీలక మార్గం గుండా స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానాన్ని కొనసాగించడానికి ఒమన్ కట్టుబడి ఉందని మంత్రి నొక్కి చెప్పారు. ఇరాన్ , ఒమన్ మధ్య ఉన్న 34 కిలోమీటర్ల జలప్రాంతాన్ని అంతర్జాతీయ జలమార్గంగా పరిగణిస్తున్నారు, గతంలో ఏ దేశమూ దీనిపై సుంకం విధించలేదు. పర్షియన్ గల్ఫ్ లోని ఈ ఇరుకైన ముఖద్వారం ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు ఐదవ వంతుకు సౌకర్యం కల్పిస్తుంది.

## మారిషస్, యుఎఇలో జయశంకర్ పర్యటన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (వుదయం) :** పశ్చిమాసియాలో యుఎస్ ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న సంఘర్షణకు స్వల్ప విరామం దొరికిన నేపథ్యంలో హిందూ మహాసముద్ర 9వ సదస్సులో పాల్గొనేందుకు, విదేశాంగ మంత్రి జైశంకర్ 2026 ఏప్రిల్ 9, 10వ తేదీలలో మారిషస్ ను సందర్శించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా, విదేశాంగ మంత్రి మారిషస్ నాయకత్వంతో సమావేశమై, ద్వైపాక్షిక



సంబంధాల సమగ్ర స్వరూపాన్ని సమీక్షించనున్నారు. ఆయన 9వ హిందూ మహాసముద్ర సదస్సులో కీలక ఉపన్యాసం కూడా చేయనున్నారు. ఈ సదస్సు సందర్భంగా, విదేశాంగ మంత్రి అందులో పాల్గొంటున్న ఇతర దేశాల విదేశాంగ మంత్రులతో చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. ఈ పర్యటన భారతదేశపు పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యత (నైబర్‌హుడ్ ఫస్ట్) విధానాన్ని, విజన్ మహాసాగర్, గ్లోబల్ సౌత్ పట్ల భారతదేశానికి ఉన్న నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఈ పర్యటన రెండవ దశలో, విదేశాంగ మంత్రి ఏప్రిల్ 11 నుండి 12 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అధికారిక పర్యటన జరుపుతారు. ఈ పర్యటన సందర్భంగా, ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సహకారాన్ని సమీక్షించడానికి, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి విదేశాంగ మంత్రి యుఎఇ నాయకత్వంతో సమావేశమవుతారు.

## చర్చలకు ముందు ఇరాన్‌కు హెచ్చరిక

### కాల్పుల విరమణ సున్నితమైన తాత్కాలిక సంధిగా అభివర్ణించిన అమెరికా ఉపాధ్యక్షుడు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 8 :** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బుధవారం ఇరాన్ కాల్పుల విరమణను అత్యంత సున్నితమైన తాత్కాలిక సంధిగా అభివర్ణించారు. ఈ వారం చివరలో ఇస్లామాబాద్‌లో ప్రారంభం కానున్న చర్చలకు ముందు టెహ్రాన్‌ను ఆయన హెచ్చరించారు. హంగరీలోని విశ్వవిద్యాలయ విద్యార్థులతో మాట్లాడుతూ, ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తే వాషింగ్టన్ ఒప్పందానికి సిద్ధంగా ఉందని వాన్స్ అన్నారు. అయితే, తప్పుదోవ పట్టించడానికి లేదా కట్టుబాట్లను ఉల్లంఘించడానికి చేసే ఏ ప్రయత్నమైనా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. దౌత్యం విఫలమైతే, అమెరికా వద్ద ఒత్తిడి తెచ్చేందుకు అనేక మార్గాలు ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు.

**సద్భావన లేదా పర్యవసానాలు**

ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరిపితే, ఒక ఒప్పందం కుదరడం సాధ్యమేనని వాన్స్ పేర్కొన్నారు. ఇరానియన్లు సద్భావనతో మాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటే, మనం ఒక ఒప్పందానికి రాగలమని నేను భావిస్తున్నాను, అని ఆయన అన్నారు. ఒకవేళ వారు అబద్ధాలు చెప్పినా, మోసాలకు పాల్పడినా, వారు సంతోషంగా ఉండలేరు, అని ఆయన హెచ్చరించారు. చర్చలు జరుపుతున్న బృందాన్ని చిత్తశుద్ధితో వ్యవహరించాలని డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారని, అదే సమయంలో టెహ్రాన్ నుండి తమ అంచనాలు దృఢంగా





ఉన్నాయని స్పష్టం చేశారని ఆయన పేర్కొన్నారు.

**విజయం తర్వాత ఐక్యతకు ఇరాన్ పిలుపు**

తాము ప్రకటించుకున్న విజయానికి సంబంధించిన పూర్తి వివరాలు ఖరారయ్యే వరకు దేశం ఐక్యంగా ఉండాలని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి కోరినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఒక ప్రకటనలో, ఇరాన్ ప్రజలను అభినందిస్తూనే, అధికారుల తీవ్ర పట్టుదల, వివేకం, స్థిరమైన ప్రజా ఐక్యత అవసరాన్ని మండలి నొక్కి చెప్పింది. లెబనాన్, ఇరాక్, యెమెన్, ఆక్రమిత పాలస్తీనా అంతటా విస్తరించి ఉన్న తన ప్రతిఘటన కూటమితో కలిసి, గత 40 రోజులలో ఇరాన్ తన శత్రువులకు గణనీయమైన దెబ్బలను రుచి చూపించిందని ప్రకటన పేర్కొంది. ఈ ప్రభావం ప్రపంచ జ్ఞాపకాల నుంచి ఎప్పటికీ చెరిపివేయలేనిది అని అది అభివర్ణించింది.

### కువైట్ స్థావరాలపై డ్రోన్ల దాడి

ఇదిలా ఉండగా, కాల్పుల విరమణ ఉన్నప్పటికీ ఇరాన్ డ్రోన్లు కువైట్‌లోని కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయని అధికారులు తెలిపారు. 05:00 జిఎంటి నుంచి కువైట్ వైమానిక రక్షణ దళాలు 28 డ్రోన్లను అడ్డుకున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి కల్నల్ సౌద్ అబ్దుల్ అజీజ్ అల్‌ఒతైబి తెలిపారు. ఆయన ఈ సంఘటనను శత్రువైన ఇరాన్ చేసిన నేరపూరిత దాడుల తీవ్రమైన పరంపరగా అభివర్ణించారు. అలాగే పెద్ద సంఖ్యలో శత్రు డ్రోన్‌లను కూల్చివేశారని తెలిపారు. కొన్ని డ్రోన్‌లు దక్షిణ ప్రాంతంలోని కీలకమైన చమురు సౌకర్యాలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీనివల్ల చమురు మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్లాంట్లు, నీటి శుద్ధి కేంద్రాలకు గణనీయమైన భౌతిక నష్టం వాటిల్లింది.

### సీజ్ ఫైర్ పరిధిలోకి

## లెబనాన్ రాదు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 8 :** ఇరాన్‌పై సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేయాలన్న అమెరికా నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. ఇరాన్ సైనిక, అణు ఆశయాలను అరికట్టడమే లక్ష్యంగా చర్చలకు అవకాశం కల్పించే విస్తృత ప్రయత్నంలో భాగంగా ఈ చర్య తీసుకున్నారు. ఈ విరామం షరతులతో కూడుకున్నదని, టెహ్రాన్ నుండి ఆశించే నిర్దిష్ట అంచనాలకు ఇది ముడిపడి ఉందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు.

**లెబనాన్‌పై నెతన్యాహు స్పష్టమైన రెడ్ లైన్**

విరామానికి మద్దతు ఇచ్చినప్పటికీ, కాల్పుల విరమణకు పరిమితులు ఉన్నాయని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ తాత్కాలిక ఘర్షణల నిలుపుదల లెబనాన్‌కు వర్తించదని నెతన్యాహు కార్యాలయం నొక్కి చెప్పింది. ఈ వ్యత్యాసం ప్రాంతీయ ఉద్రిక్తతలపై ప్రభావం చూపవచ్చు. ఇరాన్ వెంటనే జలసంధులను తెరిచి, అమెరికా, ఇజ్రాయెల్, ప్రాంతీయ దేశాలపై జరుపుతున్న అన్ని దాడులను నిలిపివేస్తే తప్ప, ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు నిలిపివేస్తూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ మద్దతు తెలుపదు. ఇకపై ఇజ్రాయెల్, పొరుగున గల అరబ్ దేశాలకు, ప్రపంచానికి, ఇరాన్ అణు, క్షిపణి లేదా ఉగ్రవాద ముప్పుగా పరిణమించకుండా చూసేందుకు అమెరికా చేస్తున్న కృషిని కూడా ఇజ్రాయెల్ సమర్థిస్తుంది అని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న చర్చల సందర్భంగా, ఇజ్రాయెల్, దాని ప్రాంతీయ మిత్రదేశాలకు ఈ ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అమెరికా హామీ ఇచ్చిందని, అయితే ఈ రెండు వారాల కాల్పుల విరమణ లెబనాన్‌కు వర్తించదని పేర్కొన్నారు. వాషింగ్టన్, దాని మిత్రదేశాలు ఇరాన్‌పై చర్చల విషయంలో సమన్వయం చేసుకుంటున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ప్రాంతీయ దేశాల నుంచి వెలువడుతున్న భిన్నవ్యాఖ్యలు దౌత్య ప్రక్రియ సంక్లిష్ట స్వభావాన్ని స్పష్టం చేస్తున్నాయి.



# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యల పరిష్కారానికై కృషి

## -మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, వైస్ చైర్మన్ సరిత



**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ వుదయం ప్రతినిధి**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను, పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మునిసిపాలిటీ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి ,వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత లు అన్నారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే పేదలకు సంబంధించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సమస్యల వలయంలో ఉన్నాయని తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఇండ్ల ప్రాంతాన్ని కూటమి కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం చైర్ పర్సన్ సంధ్యారాణి, వైస్ చైర్మన్ సరిత లు మాట్లాడారు.క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రఖని రైల్వే స్టేషన్ సమీపంలో గత ప్రభుత్వ హయాంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో 286 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి అర్హులైన పేదలకు సుమారు 230 ఇండ్లను కేటాయించారని అన్నారు. అట్టి డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతంలో సమస్యలు నెలకొని ఉన్నాయని తెలియడంతో బిఆర్ఎస్ సీపీఐ కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులతో కలిసి సందర్శించామని తెలిపారు. ఇండ్ల సమీపంలో చుట్టూ పిచ్చి మొక్కలు ఉండగా,విద్యుత్ తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇంటి డోర్లు, కిటికీలు, డ్రైనేజీ, పూర్తిగా అధ్వానంగా ఉండడంతో ఇండ్లలోకి ఎవరు రావడంలేదని స్థానికంగా ఉంటున్న కొందరు తెలిపారని, ఇట్టి విషయాన్ని స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి కి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతంలో నెలకొని ఉన్న సమస్యలను తెలియపరుస్తామని, సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతామని,వెంటనే వాటన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. ఇండ్ల చుట్టూ నెలకొని ఉన్న పిచ్చి మొక్కలను క్లీన్ చేయిస్తామని, మంచినీటిని సైతం అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. రాజా రమేష్,పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్,సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు కౌడగొని సాంబయ్య , జుంజుపల్లి శశి కుమార్, మద్దెల శంకర్, ముని, వెనంక శ్రీనివాస్, బొమ్మ భూమయ్య గౌడ్, జక్కనబోయిన మంజుల, కొప్పి రాజశేఖర్, ఆర్నె సంధ్య, గండమాల కృపానందం, రంగ లక్ష్మీ, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, అనిల్ రావు, పాల్గొన్నారు.

### అక్రమ ఇసుక రవాణాపై..

# కరీంనగర్ పోలీసుల ఉక్కుపాదం

## మార్చి నెలలో విస్తృత తనిఖీలు

## కరీంనగర్ సీపీ గౌష్ ఆలం







**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి, 139 వాహనాలను స్వాధీనం చేసుకుని, 161 మంది నిందితులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత, ప్రజా శాంతి భద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు

డివిజన్ వారీగా చర్యలుటౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు, 12 వాహనాల స్వాధీనం, 15 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు, 79 వాహనాల స్వాధీనం, 98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి.హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు, 48 వాహనాల స్వాధీనం, 48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.పోలీస్ స్టేషన్ల వారీగా ముఖ్య గణాంకాలుమార్చి నెలలోకరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్లు, 36 వాహనాల స్వాధీనం, 40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, 24 వాహనాల స్వాధీనం, 24 మంది నిందితులు నమోదు అయ్యారు.ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి.మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు, 10 వాహనాలు, 15 మంది నిందితులు గుర్తించబడ్డారు.కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు, 6 వాహనాలు, 9 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.ఈ ఏడాది మార్చి వరకు సమగ్ర గణాంకాలు2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు.డివిజన్ వారీగా టౌన్ డివిజన్ లో 24 కేసులు, 27 వాహనాలు, 32 నిందితులురూరల్ డివిజన్ లో 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితులుహుజురాబాద్ డివిజన్ లో 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులు పోలీసుల హెచ్చరిక అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు."అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము. సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం" అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం




**పెద్దపల్లి ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి)**

వచ్చే ఖరీఫ్ నాటికి గ్రామంలో అదనంగా 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంట సాగు పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకొని రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు.గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, గత రెండు సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల నాటడం జరగలేదని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ 150 ఎకరాల్లో తప్పనిసరిగా కొత్తగా ఆయిల్ పామ్ నాటేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలో ప్రస్తుతం 210 మంది రైతులు 312 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని పేర్కొంటూ, ఆయిల్ పామ్ నాటిన మొదటి మూడు సంవత్సరాల్లో మధ్యంతర పంటగా పత్తిని సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు.రైతులకు తక్కువ ఖర్చుతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడానికి జిల్లా పరిపాలన ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతుల అందరికీ విద్యుత్ సరఫరా కల్పించబడుతుందని, 40 శాతం వ్యయాన్ని భరించే రైతులకు బోర్‌వెల్లు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఎకరాకు నాలుగు సంవత్సరాలపాటు సుమారు రూ.52 వేల విలువైన సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పంటకు మొదటి విడతగా లబ్ధి పొందిన రైతులు స్వప్న, చంద్రయ్యలకు రూ.43 వేల విలువైన చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు.పంట సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించడం, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో సాగు పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో..

# ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)**

జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలోని అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను దేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పట్టణంలోని జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం చివరిదశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించి మ్యాపులను సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వివరాలు, ఇంకా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐ.సి.యు, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం సమీపంలోని యుడిఐడి (సదరం) కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ లు పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగం, రక్త పరీక్షల గది, తదితర విభాగాలు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను చూశారు. బ్లడ్ బ్యాంక్ ను తనిఖీ చేసి, రికార్డు పరిశీలించారు. రికార్డుల్లో ఇంతకు ముందు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం పొందిన వారికి ఫోన్ చేసి, వివరాలు సరిపోల్చారు. రికార్డులు, రసీదులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. తకుముందు పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కొరకు రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దిన్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# పల్లె దవాఖానను సందర్శించిన జిల్లా కలెక్టర్




**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**

"ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దేవునిపల్లి పరిధిలోని పల్లె దవాఖాన శాబ్దిపూర్‌లో గ్రామ ఆరోగ్య, పోషణ, పారిశుధ్య దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై పల్లె దవాఖాన వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలలో రక్తహీనత సమస్యను దృష్టిలో ఉంచుకొని, కలెక్టర్ సమక్షంలో ఒక గర్భిణీ స్త్రీకి హెమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించారు. అలాగే షుగర్ పరీక్షలకు సంబంధించిన కిట్లను పరిశీలించారు. గ్రామ జనాభా ప్రాతిపదికన గర్భిణీ స్త్రీల నమోదు పూర్తి స్థాయిలో చేయాలని, పిల్లలకు సమయానుకూలంగా టీకాలు అందించాలని సూచించారు. పోషణ, సీజనల్ వ్యాధులు, క్షయ, లెప్రసీ వంటి వ్యాధులపై గ్రామ సర్పంచ్, హెల్త్ కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది సమన్వయంతో ప్రజల్లో అవగాహన కల్పించి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. డి. రవీందర్ గౌడ్ , ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాజు, మెడికల్ ఆఫీసర్, డీపీఓ పద్మజ , స్థానిక సర్పంచ్ , మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్ కె హరిత



**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ కె . హరిత పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల తో పాటు తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వసతులు రోగులు వైద్య సిబ్బంది వివరాలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించి పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందేలా కృషి చేయాలన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల పరిశీలించి తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వంటగది పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన విద్యా భోజనం అందించాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో పాఠశాల భవనం ఉరుస్తుందని విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విద్యార్థుల అవసరం మేరకు అదనపు గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేయాలని అధికారులకు సూచించారు. తహసిల్దార్ రామ్మోహన్ ,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, వార్డెన్ శ్రీనివాస్, వైద్యులు సిబ్బంది ఉన్నారు.

# మహిళా సిబ్బందికి ఆరోగ్యం పై అవగాహన




**నిజామాబాద్, వుదయం ప్రతినిధి:**

గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ మరియు ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ నిజామాబాదు వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ( మహిళలకు క్యాన్సర్ సంబంధించిన) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐపీఎస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 24/7 విధినిర్వహణలు నిర్వహిస్తూ తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు ఎల్లప్పుడూ తీసుకోవాలని అందుకోసం డాక్టర్ ల సూచనలు మరియు సలహాలు పాటించాలని తెలియజేశారు.మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడం ద్వారా చికిత్స సులభం అవుతుందని ప్రతి ఒక్కరూ నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం బాగున్నప్పుడే విధి నిర్వహణకు తమ శరీరం సహకరిస్తుందని కావున ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు పాటించినట్లయితే ఆరోగ్యానికి ఎలాంటి హాని కలవకుండా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్లో లభ్యమవుతున్నటువంటి ఫ్రూట్స్ వివిధ రకాల ఫ్రూట్స్ నుండి అన్ని రకాల జాగ్రతలు తీసుకొని వాటిని వాడాలని తెలిపారు. మన శరీరమునకు ఏ ఆహారం తింటే జీర్ణం అవుతుందో అదే ఆహారాన్ని తీసుకోవాలని అంతేకానీ జీర్ణం కానీ ఆహారము తీసుకొని బాధపడకూడదు అని అన్నారు. తదుపరి క్యాంపుకు వచ్చినటువంటి మహిళా పోలీస్ సిబ్బందికి ఉచితముగా వైద్యం అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత మందుల పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ వైద్య విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.క్యాన్సర్ లక్షణాలు నివారణ చర్యలు మరియు తగిన జాగ్రత్తలపై సమగ్ర సమాచారం సంబంధిత డాక్టర్ల ద్వారా అందించబడింది. అదనపు డి.సి.పి (అడ్మిన్) శ్రీ జి. బస్వారెడ్డి , అదనపు డి.సి.పి (సి.ఏ.ఆర్) శ్రీ కె. రాంచందర్ రావ్ , పోలీస్ యూనిట్ డాక్టర్ సరళ , డాక్టర్ జి .అమర్ దీపిక (మెడికల్ డైరెక్టర్ ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్) , డాక్టర్ పి.అరవింద్ (రేడియేషన్ ఒంకలోజిస్ట్) , డాక్టర్ శైలజ (గైనకాలజిస్ట్) , డాక్టర్ రితిక (డి.ఎమ్.ఓ ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్), డాక్టర్ రవీంద్రనాథ్ సూరి (సీనియర్ డాక్టర్ ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ ) , మధు (స్క్రీనింగ్ క్యాంపు కోఆర్డినేటర్) , నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బంది , పోలీస్ కార్యాలయం మరియు రేంజ్ కార్యాలయం మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అరబిందో విద్యార్థినుల ఎంపిక




**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**

రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవే శాల కోసం నిర్వహిం చిన జిల్లా స్థాయి ఎంపికల్లో ధర్మ పురి మండ లం నేరెళ్ల గ్రామానికి చెందిన గండి కోట సహన్య,మలవత్. సాయి పల్లవి సత్తా చాటారు. అరబిందో పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థినులు క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపి కయ్యారు.జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో తమ క్రీడా నైపు ణ్యంతో అందరినీ ఆకట్టుకున్న వీరిని పాఠ శాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జాజాల రవీందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థు లు క్రీడల్లో రాణిం చడం గర్వకారణ మని, రాష్ట్ర స్థా యి లోనూ ప్రతిభ చాటి పాఠశా లకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనం తరం పాఠశాల ఇన్చార్జ్ పు రంశెట్టి హరీష్,వ్యాయామ ఉపా ధ్యాయుడు హరీష్,ఉపాధ్యాయ బృందంవిద్యార్థినులను ఘనంగా సన్మా నించి శుభాకాంక్ష లు తెలియజేశారు. గెలుపు పట్ల నేరెళ్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో

# రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్



**రాజన్న సిరిసిల్ల, వుదయం :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు 40 శాతం పూర్తి చేసి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆత్మగౌరవ ప్రతీక సాకారం దిశగా ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోంది. ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా రూ. 161 కోట్లకుపైగా ఆర్థిక సహాయం జమ చేసి.. రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాల వేడుకలు సాగుతున్నాయి.

సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఆ కల సాకారానికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. ఇండ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడుతల్లో అందజేస్తుంది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**నెరవేరిన 20 ఏండ్ల కల..**
**కోడూరి రజిత, ఉప్పగడ్డ, వేములవాడ పట్టణం**

నాకు సొంత ఇల్లు లేదు. 20 సంవత్సరాలుగా వేములవాడ పట్టణంలో నివాసం ఉంటున్న. సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డ. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. నా ఇల్లు పూర్తి అయింది. ఎంతో సంతోషంగా ఉంది. నా కల సాకారానికి సహకారం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గారికి కృతజ్ఞతలు.

**సద్వినియోగం చేసుకోవాలి**
**- వెంకట మాధవరావు, పీడీ హౌసింగ్**

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారు తమ సమీపంలోని హౌసింగ్ అధికారులను సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం లోనే ఇల్లు పూర్తి చేసుకునేలా జిల్లాలో మా శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లు నిర్మించాము. నేరుగా సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చు.

# మెల్లకుంట తండాలో ఎఫ్ఎండీ టీకాలు

**నాగిరెడ్డిపేట్,వుదయం :**

మండలంలోని మెల్లకుంట తండా గ్రామంలో బుధవారం పశువులకు ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (ఎఫ్ఎండీ) టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని మండల పశు వైద్యాధికారి రవికుమార్ తెలిపారు.ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ... మెల్లకుంట తండా గ్రామంలో 165 ఎద్దులకు,86 గేదెలకు టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి రవి కుమార్ తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరు పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో మెల్లకుంట తండా సర్పంచ్ బాల్య నాయక్,ఉప సర్పంచ్ రామావత్ వాసురం ,పశు వైద్యాధికారి రవికుమార్, సిబ్బంది విజయ,జయరాజ్, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.



### లక్షెట్టిపేట్ మున్సిపాలిటీ

# కో ఆప్షన్ సభ్యులు వీరే

**లక్షెట్టిపేట్, ఏప్రిల్ 8 (వుదయం ప్రతినిధి):**

మున్సిపాలిటీలో 4 కో ఆప్షన్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నలుగురు సభ్యుల పేర్లను ప్రకటించారు. మున్సిపాలిటీలోని 14వ వార్డు మాజీ కౌన్సిలర్ చింత సువర్ణఅశోక్ కుమార్, ముస్లిం మైనారిటీకి చెందిన సయ్యద్ తహిసీన్ హజీ, తోగిటి నరసింహ చారి, క్రిస్టియన్ మైనారిటీ చెందిన నక్క జాకబ్ పేర్లను ప్రకటించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా క్రిస్టియన్ మైనార్టీ కి కో ఆప్షన్ గా ఇవ్వడం హర్షించదగ్గ విషయం.

# తండ్రి పుట్టినరోజున.. బడికి కంప్యూటర్ కానుక బండారి మనోజ్



**వరంగల్ టౌన్, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :**
తండ్రి పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక బాధ్యతగా పాఠశాల విద్యాభి వృద్ధికి తోడ్పాటునందించడం అభినం దనీయమని పలువురు కొనియాడారు. బుధవారం 34వ డివిజన్‌కు చెందిన బండారి కృష్ణమూర్తి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన కుమారుడు బండారి మనోజ్ శ్వేత దంపతులు శివ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్‌ను బహుకరించారు.
ముఖ్య అతిథుల సమక్షంలో.. 35వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి మేరుగు అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, మనోజ్ శ్వేత దంపతులు కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూస నరేంద్రస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా బండారి మనోజ్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, పుట్టినరోజు వంటి సందర్భాల్లో ఇలాంటి ఉపయోగకరమైన వస్తువులను ప్రభుత్వ పాఠశాలలకు అందించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీహాన్ వర్ధన్, కలువల రాహుల్, గోదాసి శివ, అంకతి అఖిల్ లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం తిరుపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దేవరాజ్, అంజయ్య, నరేందర్, రంగాచారి, సంపత్, కవిత, సుహాసిని, స్వప్న, భవాని, కృష్ణమూర్తి, కిరణ్మయి మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మనోజ్ చేసిన ఈ సాయాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# మూడుచెక్కలపల్లిలో తీరనున్న నీటి కష్టాలు

**బోరు బావికి నూతన మోటారు ఏర్పాటు**
**నీటిని వృథా చేయొద్దు**
**సర్పంచ్ కవితా దేవు నాయక్**



**నల్లబెల్లి, ఏప్రిల్ 8(వుదయం):**
మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. గ్రామంలోని అంగోతు కోటియా ఇంటి సమీపంలో ఉన్న బోరు బావికి గ్రామ ప్రజల సౌకర్యార్థం బుధవారం నూతన మోటారు సెట్‌ను ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా ఇక్కడ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో గ్రామస్తుల విన్నపం మేరకు కొత్త మోటారును అమర్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సపావట్ కవితా దేవు నాయక్ మాట్లాడుతూ.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీరు ఎంతో అమూల్యమైనదని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వాడుకోవాలే తప్ప వృధా చేయకూడదని ఆమె సూచించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బానోతు మంగణ, సపావట్ యాకన్న, గ్రామ కరోబార్ శ్యాంసుందర్, పంచాయతీ సిబ్బంది యాకయ్య, కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కొత్త మోటారు ఏర్పాటుతో నీటి సమస్య తీరడంపై స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ వెన్నెపురెడ్డి మోహనరెడ్డి**



**మహాదేవపూర్ ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి):**
గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి అని కాళేశ్వరం గ్రామ సర్పంచ్ వెన్నెపురెడ్డి మోహనరెడ్డి అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోడాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో ( సేఫ్ మదర్ హుడ్ ) సురక్షిత మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ వెన్నెపురెడ్డి మోహనరెడ్డి, పాల్గొని మాట్లాడుతూ...
సమాజంలో తల్లి పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే గర్భిణీలు పోషకాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రభుత్వ ప్రోత్సాహంతో సర్కారు దవాఖానల్లో గర్భిణీలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, మందులు మరియు పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.పథకాల అమలు సురక్షిత ప్రసవాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే క్రమంలో డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం,పోషకహారం టీకాలు, వైద్య పరీక్షల పై అవగాహన కలిపించి సుఖ ప్రసవం,మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించడం,చిన్న పిల్లల టికాలు,గర్భిణీలు తల్లులు, తీసుకోవలిసిన జాగ్రత్తలు, బాల్య వివాహేల నిరోదించుట,కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించుట వైద్య, అంగన్వాడీ సేవలు వినియోగం గురించి అవగాహనా కల్పించారు కార్యక్రమం లో హెల్త్ సూపర్ వైజర్ సమ్ము, హెల్త్ అసిస్టెంట్ రాజరమణయ్య, అంగన్వాడీ సూపర్ వైజర్ స్పందన ఏ ఎన్ యం,రాజమణి ,ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

# గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

**సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి**



**రాయపర్తి ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి):**
గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యమని సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని 6 వ వార్డు లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టిపిసిసి ఉపాధ్యక్షురాలు అనమండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు గ్రామ ప్రజలు అందరం కలిసి కట్టుగా కృషి చేసినట్లయితే గ్రామాన్ని అభివృ ది చేసుకోవచ్చని తెలిపారు.
ఈ పంచాయతీకార్యదర్శి పల్లె వినోద్ ఉప సర్పంచ్ మచ్చ రమేష్ ,వార్డు సభ్యులు నూనె అనూష, కుంట రాజు, గారే కళ్యాణి విష్ణు, ఫెరోజ్, మల్యాల నరసింహమూర్తి, కోతి వీరన్న, బక్కతట్ల సాయిలు, శంకర్, కారోబర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 08 (వుదయం జిల్లా ప్రతినిధి):**
జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలో ఉన్న ఎన్నికల ఈవీఎం గోదాంను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాం భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి, అనంతరం లాక్ బుక్‌లో సంతకం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాంను నిరంతరం పటిష్ఠ భద్రతా నిబంధనల నడుమ పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తరచూ పరిశీలించాలని ఆదేశించారు.అదేవిధంగా గోదాంలో ఎప్పటికప్పుడు పహారా విధులు నిర్వహణ, రిజిస్టర్లలో సరైన నమోదు, మరియు సాంకేతిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు భద్రత అత్యంత కీలకమైన అంశాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ టోల్ టాక్స్ రద్దు చేయాలి



**టేకుమట్లఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :**
మండలంలోని బోర్నపల్లికిష్టంపేట గ్రామాల మధ్యలో ఉన్న చలివాగుపై అక్రమ టోల్ టాక్స్ వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఎంఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా చలివాగులో రోడ్ నిర్మాణం చేసి అట్టి రోడ్డు పై నుండి ప్రయాణం చేసే వాహనానికి రేటు నిర్ణయించి , టోల్ టాక్స్ పేరిట డబ్బులు వసూల్ చేస్తున్నారని, ఇంత దందా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని, అధికారులు స్పందించి అక్రమ టోల్ టాక్స్ వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# జిల్లా కేంద్రంలో అస్తవ్యస్త ంగా ప్రధాన ఆసుపత్రి

**ఆసుపత్రి సూపరింటెం డెంట్ పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం**



**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 08 ( వుదయం జిల్లా ప్రతినిధి):**
జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులపై భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆసుపత్రి సూపరింటెం డెంట్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం ఆయనజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఆసుపత్రిని సందర్శించి, అన్ని విభాగాలను సమగ్రంగా పరిశీలించారు.ఆసుపత్రిలోని క్యాజువలిటీ, ల్యాబ్ , ఎం.ఆర్.ఐ, ఔట్ పేషెంట్ గదులు పరిశీలించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.క్యాజువాల్టీలో 6 మంచాలు మాత్రమే ఉన్నాయని అత్యవసరంగా ఒకే సమయంలో ఎక్కువ మంది రోగులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలుపగా నూతనంగా 15 మంచలతో ఒక క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామని ప్లానింగ్,అంచనాలు తయారు చేసి ఇవ్వాలని టి.జి.ఎం.ఐ.డి.సి అధికారులను ఆదేశించారు.అనంతరం ఆసుపత్రి ల్యాబ్‌ను పరిశీలించి అన్ని రకాలైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు
.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుద్యం సరిగా లేకపోవడం, వార్డులు మరియు పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు సరిగా లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణపై బాధ్యత వహిస్తున్న పర్యవేక్షకుడిని హెచ్చరించారు. ఆసుపత్రిలో పారిశుద్యం, నిర్వహణ, సిబ్బంది సమయ పాలన మెరుగు పరచాలని ఆదేశించారు.. ఆసుపత్రిలో పారిశుద్యాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. . క్యాంటీన్ లో పరిశుభ్రత తో కూడిన నాణ్యమైన వంటకాలను అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంటీన్ లో టిఫిన్స్ రుచిచూశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్, మధుసూదన్,ఆసుపత్రి పర్యవేక్షకులు డా. రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ఉపసర్పంచ్ లు ముందంజలో ఉండాలి

**ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బొట్ల కార్తీక్**



**చిట్యాల ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి):**
ప్రజా సమస్యల పరిష్కారంలో ఉప సర్పంచ్ లు ముందంజలో ఉండాలి అని ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బొట్ల కార్తీక్ అన్నారు బుధవారం చిట్యాల మండల కేంద్రంలో ఉపసర్పంచ్ ల సంఘం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల స్థాయి ఉప సర్పంచ్ ల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల కార్తీక్ హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఉపసర్పంచ్ లు ముందంజలో ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఉప సర్పంచ్ ల ఐక్యతకు క్షేత్ర స్థాయిలో ఉపసర్పంచ్ ల సంఘం నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కార్తీక్ పిలుపునిచ్చారు.అనంతరం ఉపసర్పంచ్ ల సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు గట్టు ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ లతో పాటు ఉపసర్పంచ్ లకు కూడా ప్రత్యేక విధులు అప్పచెప్పాలని ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అదే క్రమంలో ఉపసర్పంచ్ ల సంఘం చిట్యాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ గౌడ్ తెలిపారు అధ్యక్షుడిగా గుంటూరుపల్లి ఉపసర్పంచ్ ముద్దన నాగరాజు. గౌరవ అధ్యక్షుడు.పులి రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి. కేంపల్లి శ్రీకాంత్,ఉపాధ్యక్షుడిగా. ఏక్ అనిల్. వర్కింగ్ ప్రెసిడెంట్. నల్ల అశోక్, కోశాధికారి. మరి సమ్మక్క, అధికార ప్రతినిధి. సిరిపురం నరసింగం కార్యదర్శి.తిరుపతి, లను ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు ఎల్లండి నరేష్, టేకుమట్ల ఉపసర్పంచ్ ఖాదర్, తో పాటు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్**



**భూపాలపల్లి ఏప్రిల్ 08 (వుదయం విలేకరి):**
లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా స్కానింగ్ కేంద్రాల్లో ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే రూ.10 వేలు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు.అలాగే జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా క్రింది సూచనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.
ప్రతి స్కానింగ్ కేంద్రంలో పరికరాలను నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయాలి
గర్భిణులకు సరిపడ కూర్చీలు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలి వైద్యుల వివరాలు, స్కానింగ్ రుసుములు గోడపై స్పష్టంగా ప్రదర్శించాలి గర్భిణుల స్కానింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసి, వారి సంతకాలు తీసుకోవాలి లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలి ప్రైవేట్ ఆస్పత్రులు మరియు స్కానింగ్ కేంద్రాలు గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు లింగ నిర్ధారణ నిషేధంపై అవగాహన కల్పించాలని సూచించారు.
లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా నిషేధితమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఓ డాక్టర్ శ్రీదేవి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ దేవేందర్, డాక్టర్ సుధాకర్ డాక్టర్ సంధ్య, ఎన్‌జీవో ప్రతినిధి శ్యాంప్రసాద్, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# పింగిళి కళాశాలలో చేరండి

**బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి**
**- ఇంటర్ విద్యార్థులకు పింగిళి కళాశాల విశిష్టతను వివరించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు**



**కాజీపేట, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :**
హనుమకొండ లోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి నాయకత్వంలో అధ్యాపక బృందం జనగాం, ఘన్‌పూర్, మడికొండ, ధర్మసాగర్, చాగల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, విద్యార్థులకు కళాశాల విశిష్టతను వివరించారు. కళాశాల ప్రత్యేకతలు ఇవేకోర్సులు బి.ఏ, బి.కాం, బి.బి.ఏ, బీఎస్సీ (లైఫ్ సైన్స్ & ఫిజికల్ సైన్స్)తో పాటు ప్రస్తుత కాలానికి అనుగుణంగా అత్యాధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జాతీయ స్థాయి న్యాక్ 'ఏ' గ్రేడ్, అటానమస్ హోదా మరియు ఐఎస్ఓ గుర్తింపు పొందిన నాణ్యమైన విద్యా సంస్థ.వసతులు సుశిక్షితులైన అధ్యాపకులు, అధునాతన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, వర్చువల్, డిజిటల్ స్మార్ట్ తరగతి గదులు.కెరీర్ గైడెన్స్ సివిల్స్, గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షలకు ద్వారా ఉచిత శిక్షణ. ఉద్యోగ అవకాశాలు నిరంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తూ ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ కల్పించడం.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పింగిళి కళాశాల వేదికగా నిలుస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంబేద్కర్ విజినరీ యూత్ అసోసియేషన్ ఎన్నిక

**యువత ఏకగ్రీవ నిర్ణయం**
**కొత్త కమిటీకి బాధ్యతలు**

**చెన్నారావుపేట ఏప్రిల్ 8 (వుదయం న్యూస్ ప్రతినిధి):**
మండల పరిధిలోని పాత మొగ్గుంపురం గ్రామంలో సోమవారం అంబేద్కర్ విజినరీ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గద్దల ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా అల్వాల శ్రీ పాల్, ప్రధాన కార్యదర్శిగా పరికి నవీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికలలో గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్,ఉపసర్పంచ్ అల్వాల శ్రీనివాస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి, వార్డు మెంబర్ జన్ను రమేష్ ల ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించారు అనంతరం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ గద్దె వద్ద యూత్ లోగో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుణాకర్ మాట్లాడారు.
ఈ కార్యక్రమంలో మాదాసి రమేష్, ఎండి పెరోజ్, మాదాసి రాజేందర్, మాదాసు సునీల్, సుంకరి కత్తి, ఎస్.కె ఫిరోజ్, మాదాసి చింటు, అల్వాల కిక్కు తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



**హనుమకొండ క్రైం, ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి) :**
ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం రోజున పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సీపీ పనితీరును తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే "Arrive Alive" కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్. ఐ రాజు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**భూపాలపల్లి ఏప్రిల్ 08 (వుదయం విలేకరి):**
భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా జిల్లాలో నేర నియంత్రణ, పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించబడనుంది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, టెక్నాలజీ వినియోగంతో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన భద్రత అందించడమే లక్ష్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల మానిటరింగ్ ఈ కేంద్రం ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, వెల్ఫేర్ ఆర్ ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి జిల్లా ఎస్పీ పరామర్శ



**భూపాలపల్లి ఏప్రిల్ 08 (వుదయం విలేకరి):**
అనారోగ్య సమస్యలతో మరణించిన హోం గార్డు కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించారు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరణించిన హోం గార్డు రంజిత్ మృతదేహానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట సమయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు
.అదేవిధంగా, మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ గుడుంబా తయారీపై కొయ్యూరు పోలీసుల మెరుపు దాడి



**మల్హర్ ఏప్రిల్ 08 (వుదయం ప్రతినిధి):**
మల్హర్ మండలం కొయ్యూరు పోలీస్‌లు అక్రమ గుడుంబా తయారీపై బుధవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు అక్రమంగా గుడుంబా తయారీ చేస్తున్న స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించినట్లు తెలిపారు దానిలో భాగంగా మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన కొరకాని సమ్మయ్య (40) అక్రమంగా గుడుంబా తయారు చేస్తుండగా పట్టుబడ్డట్టు అతని వద్ద నుండి 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, సుమారు 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగిందనిఅన్నారు అలాగే అదే గ్రామానికి చెందిన చీర్ల రాజేశ్వరి (50) గుడుంబా తయారు చేస్తుండగా పట్టుబడింది. ఆమె వద్ద నుండి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, సుమారు 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.ఈ ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ గుడుంబా తయారీ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# సెన్సస్ 2027 హెచ్.ఎల్.బి ల ఏర్పాటుపై శిక్షణ

**డిపిఓ కల్పన .**
**తహసిల్దార్ ముప్పు కృష్ణ**



**నల్లబెల్లి, ఏప్రిల్ 8(వుద యం):**
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సెన్సస్ 2027కు సంబంధించి హెచ్.ఎల్.బి.ల క్రియేషన్ ప్రక్రియపై జి.పి.ఓలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి కల్పన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సెన్సస్ ప్రక్రియలో భాగంగా హెచ్.ఎల్.బి (హౌస్ లిస్టింగ్ బ్లాక్) ల ఏర్పాటు అత్యంత కీలకమని, దీనిని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, తహసిల్దార్ ముప్పు కృష్ణ మాట్లాడుతూ, ఇంటింటి వివరాల సేకరణ కోసం ఏర్పాటు చేసే బ్లాకుల విషయంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రవి, ఏ.ఎస్.ఓ అనిల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సంపత్, చామంతి జి.పి.ఓలు, పంచాయతీ కార్యదర్శులు, బి.ఎల్.ఓలు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## కప్పువాము నీరుతో ఆ సమస్యలకు చెక్..

ఉదయాన్నే ఖాళీ కడుపుతో వాము నీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గడం, జీర్ణ సమస్యలైన గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, కీళ్ల నొప్పులు, కొలెస్ట్రాల్, పీరియడ్స్ నొప్పి వంటి అనేక అనారోగ్య సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. ప్రస్తుత ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలామంది అధిక బరువు, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా అనేక వ్యాయామాలు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించని వారికి.. వాము నీరు ఒక సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. డయాబెటిస్, అధిక లేదా తక్కువ రక్తపోటు, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి వంటి అనేక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందడానికి వాము నీరు ఎంతగానో సహాయపడుతుంది. మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి వాము ఒక అద్భుతమైన ఔషధం. ఆయుర్వేద మూల గ్రంథమైన అష్టాంగ హృదయంలో మహర్షి వాగ్భటాచార్య వామును వాత, పిత్త, కఫ నాశకారిణిగా వర్ణించారు. అంటే, కడుపులో ఏర్పడే గ్యాస్ (వాతం), ఎసిడిటీ (పిత్తం), శ్లేష్మం (కఫం) వంటి సమస్యలను ఇది నివారిస్తుంది. వాత దోషం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, శరీర నొప్పులు, గుండెలో నొప్పి వంటి సమస్యలకు వాము నీరు పరిష్కారం చూపుతుంది. వాములో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, నికోటిన్ ఆసిడ్, కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. వాము నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది. మలబద్ధకం కారణంగా వచ్చే పైల్స్ వంటి సమస్యల నివారణకు కూడా ఇది చాలా ఉపయోగపడుతుంది. వాము నీటిని తయారు చేసే విధానం: రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో అర టీస్పూన్ వామును వేసి నానబెట్టాలి. ఉదయాన్నే వాము పూర్తిగా నానిపోయి, నీరు రంగు మారుతుంది. ఈ నీటిని నేరుగా లేదా గోరువెచ్చగా చేసుకుని తాగవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు గోరువెచ్చగా తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. మరొక పద్ధతిలో, వామును నీటిలో వేసి బాగా మరిగించి, ఆ నీటిని చల్లార్చి తాగవచ్చు. ఈ పద్ధతి ముఖ్యంగా పీరియడ్స్ నొప్పి, గొంతు నొప్పి వంటి వాటికి ఉపశమనం కలిగిస్తుంది. వాము నీరు శరీర మెటబాలిజంను పెంచుతుంది. ఆకలి లేని వారికి ఆకలిని కలిగిస్తుంది. దీర్ఘకాలంగా అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలనుకునే వారికి వాము నీరు ఒక అద్భుతమైన సహజ చికిత్స.. అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే ఈ నీటిని తాగడం మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.



## మొటిమల్ని తగ్గించే 'కలబంద' ప్యాక్!

చర్మానికి చల్లదనాన్ని అందించడమే కాదు.. ముఖంపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడంలోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదని చెప్పచ్చు. అందుకే దీన్ని వివిధ రకాల సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో కలబందతో పాటు ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం రండి.. కలబంద గుజ్జు – మూడు టేబుల్‌స్పూన్లు, పసుపు – రెండు టేబుల్‌స్పూన్లు, రోజ్ వాటర్ – రెండు టేబుల్‌స్పూన్లు, శెనగపిండి – టేబుల్‌స్పూన్, కలబంద గుజ్జు, పసుపు, రోజ్‌వాటర్.. ఈ మూడింటినీ గ్రైండర్‌లో వేసి మిక్సీ పట్టుకోవాలి. ఆపై ఇందులో శెనగపిండి వేసి మరోసారి మిక్సీ పట్టుకోవాలి. అవసరమైతే ఇందులో ఇంకాస్త రోజ్‌వాటర్ లేదంటే శెనగపిండి వేసుకొని పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని.. 20 నిమిషాల పాటు ఉంచి.. ఆపై గోరువెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల మొటిమల సమస్యను ఇట్టే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.



## ఉదయాన్నే ఇలా చేస్తున్నారా?

చర్మం ఆరోగ్యంగా ఉండాలి, మెరిసిపోవాలి అనే కదా ఏ అమ్మాయైనా కోరుకునేది? అది సాధ్యమవ్వాలంటే తగిన జాగ్రత్తలూ తీసుకోవాలి. ముఖ్యంగా ఉదయం కొన్నింటిపై దృష్టిపెట్టాలి. మీ డే రొటీన్‌లో అవి ఉన్నాయేమో చూసుకోండి మరి! ఉదయాన్నే చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. నీళ్లు కొంచెం ఎక్కువ చల్లగా ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. ఇది చర్మకణాలకు ఆక్సిజన్ సరఫరా, రక్తప్రసరణ మెరుగ్గా జరిగేలా చేస్తుంది.లేచిన పావుగంటలోపు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగండి. గంటలపాటు నిద్రలో గడిపేస్తాం. ఈ క్రమంలో శరీరం డీహైడ్రేషన్‌కి గురవుతుంది. నీళ్లు తాగితే తిరిగి హైడ్రేట్ అవ్వడమే కాదు, మలినాలూ బయటికి పోతాయి. నిమ్మకాయ, కాస్త ఉప్పు చేర్చుకుంటే కోల్పోయిన ఎలక్ట్రోలైట్లని తిరిగి పొందొచ్చు. ఇది చర్మాన్నీ తేమగా కనిపించేలానూ చేస్తుంది. 3–5 నిమిషాలు ముఖాన్ని మసాజ్ చేయండి. ఏదైనా నచ్చిన నూనె తీసుకుని, ముఖమంతా వృత్తాకారంలో మర్దనా చేసుకున్నా మంచిదే. మాయిశ్చరైజర్ తప్పక రాయండి. విటమిన్ సి ఉన్నవి వాడితే మేలు. ఇది చర్మాన్ని మెరిపించడమే కాదు, ఎండతోనూ పోరాడుతుంది. అలాగని సన్‌స్క్రీన్‌ని మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. చర్మ ఆరోగ్యమ్మీద వ్యాయామాలు చూపే ప్రభావమూ ఎక్కువే. కాబట్టి, అల్పాహారానికి ముందు 10–15 నిమిషాలు తప్పక వ్యాయామం చేయాలి. ఇదీ చర్మానికి ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడగలదు. సెల్ రిపేరింగ్‌కీ సాయపడుతుంది. చెమట ద్వారా విషపదార్థాలు బయటకు వచ్చేలానూ చేస్తుంది. చర్మంలో కొలాజెన్ ఏర్పడటానికి అమైనో యాసిడ్లు ప్రధానం. అది అందాలంటే ప్రొటీన్ ఆధారిత ఆహారం అంటే గ్రీక్ యోగర్ట్, చేప, ప్రొటీన్ స్మూతీలు, గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటారుగా మరి.



## వంద రోగాలను తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయ..



ఎరుపు రంగు పుచ్చకాయ కంటే పసుపు పుచ్చకాయ తినడమే బెస్ట్ అని వైద్యులు కూడా చెబుతున్నారు. వీటిలో విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. అలాగే, దీని వలన రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఆ రోగాలను ఇట్టే తరిమికొట్టచ్చు పసుపు రంగు పుచ్చకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది. అలాగే, ఇమ్యూనిటీ పవర్ ను కూడా పెంచుతుంది. చర్మం, కంటి ఆరోగ్యం: దీనిలో ఉండే బీటా కెరోటిన్ చర్మం, కంటి సమస్యల కాపాడుతుంది. అందుకే, దీనిని తినాలని వైద్యులు చెబుతున్నారు హైడ్రేషన్: వీటిలో 90% కంటే నీరు ఎక్కువ ఉంటుంది. ఇది అన్ని రోగాలను నివారిస్తుంది. గుండె ఆరోగ్యం: వీటిలో పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రెజర్ ను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ: వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను పనితీరును మెరుగుపరుస్తుంది.

## కుదుళ్లకు మసాజ్.. ఎందుకంటే?!

గోరువెచ్చని నూనెతో కుదుళ్లకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదా! అయితే దీనివల్ల కేవలం కుదుళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాదు.. జుట్టు ఒత్తుగానూ పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం రండి..



కుదుళ్ల మర్దన కోసం జొజోబా లేదా బాదం నూనె ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందట. మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనెను ఉపయోగించకూడదు. ఎందుకంటే దీనివల్ల కుదుళ్లు, ముఖం జిడ్డుగా మారి.. ఇతర సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుందంటున్నారు నిపుణులు. మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుందట. చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే అవి కుదుళ్లకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది. నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. అలాగే ఒత్తుగా కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

## గ్లాస్ బార్లీ తీసుకుంటే శరీరంలో జరిగే మార్పు..

బార్లీ వాటర్ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. డైలీ ఉదయాన్నే బార్లీ నీరు తాగడం వల్ల బరువు తగ్గుతుంది. ఇంకా శరీరంలోని వేడి తగ్గుతుంది.. అధిక కొలెస్ట్రాల్ తగ్గడంతోపాటు..బాడీ క్లీన్ అవుతుంది. బార్లీ తీసుకోవడం శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బార్లీ అనేది అనేక పోషకాలను కలిగి ఉన్న ధాన్యం. బార్లీని తరచుగా తీసుకోకపోయినా, ఎండాకాలంలో బార్లీ నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. బార్లీలో ఇనుము, భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం, ఫోలేట్, నియాసిన్, విటమిన్లు, సోడియం, పొటాషియం, మాంగనీస్, ప్రోటీన్, శక్తి, రాగి, జింక్ మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. దీనిని గరిబోళ్ల సంజీవని.. లేదా.. పానీయంగా పేర్కొంటారు. ఎందుకంటే ఇది తక్కువ ఖర్చుతో కూడిన, అత్యంత పోషకమైన ఆరోగ్య పానీయం. ఇది శరీరానికి చలువ చేయడంతోపాటు.. పలు అనారోగ్య సమస్యలకు నివారణిగా పనిచేస్తుంది.బార్లీ నీరు తాగడం వల్ల శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది రుచికరంగా కూడా ఉంటుంది. ఇది పేగు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు బార్లీ నీటిని తమ ఆహారంలో చేర్చుకోవచ్చు.బార్లీ నీరు తాగడంవల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. కు కూడా అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటే, మీరు ఈ ఆరోగ్యకరమైన నీటిని క్రమం తప్పకుండా తాగవచ్చు. మహిళలు తరచుగా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటారు. బార్లీ నీరు తాగడం వల్ల ఇతర మూత్ర సమస్యలను నివారించవచ్చు. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా చాలా ఆరోగ్యకరమైన పానీయం. బార్లీ నీరు తాగడం వల్ల మూత్రపిండాల సమస్యలు నివారిస్తుంది. ఇంకా మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బార్లీ నీటిని ఎలా తయారు చేయాలి: కొంచెం బార్లీని లేదా మూడు నాలుగు స్పూన్ల బార్లీ పొడిని తీసుకొని ఒక పెద్ద గిన్నెలో వేసి దానిలో నీళ్లు పోసి.. 7–8 నిమిషాలు ఉడకబెట్టండి. మరిగిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయండి.. అనంతరం ఒక కప్పులోకి వడకట్టి, నిమ్మరసం వేసుకుని తాగండి.. ఇంకా.. వేడిగా ఉన్నప్పుడు కూడా డీటాక్స్ నీటిని టీ లాగా నెమ్మదిగా తాగవచ్చు.



## రాగిజావ ఎప్పుడు తీసుకుంటే మంచిది?

రాగి జావ అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది క్యాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్‌లతో నిండి ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, బరువు తగ్గడానికి, ఎముకలు దృఢంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి దోహదపడుతుంది.. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గించి, పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుంది. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి. అందుకే.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ రాగి జావ తాగాలని సూచిస్తుంటారు ఆరోగ్య నిపుణులు.. వాస్తవానికి రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సంప్రదాయ ఆహారం. దీనిని రోజుకొకసారి తీసుకోవడం వల్ల పొట్టలో చల్లదనం లభించడంతో పాటు ఆరోగ్యపరంగా అనేక లాభాలు చేకూరుతాయి. రాగులలో క్యాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్, మినరల్స్, అయోడిన్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కొవ్వులు చాలా తక్కువగా ఉండటం, ముఖ్యంగా అసంతృప్త కొవ్వును కలిగి ఉండటం వల్ల ఇది చాలా సులభంగా జీర్ణమైపోతుంది. అంతేకాకుండా.. ఇది ఎముకలను బలోపేతం చేసి, తక్షణ శక్తిని అందిస్తుంది. రాగి జావ ఆరోగ్య ప్రయోజనాలు:బరువు నియంత్రణ: రాగుల్లో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఉండటం వల్ల ఇది ఆకలిని తగ్గిస్తుంది. ఫలితంగా, అధిక ఆహారం తీసుకోవడాన్ని నియంత్రించి, బరువును నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి రాగి జావ లేదా సంగటి మంచి ప్రయోజనం అందిస్తుంది. ఎముకల దృఢత్వం: రాగులలో క్యాల్షియం పుష్కలంగా లభిస్తుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి. పిల్లల ఎదుగుదలకు కూడా ఇందులో ఉండే క్యాల్షియం తోడ్పడుతుంది.రక్తహీనత నివారణ: రాగులలో ఐరన్ మోతాదు ఎక్కువగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు దీనిని తరచూ తీసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందవచ్చు.రోగనిరోధక శక్తి పెరుగుతుంది: రాగి పిండిలో విటమిన్ సి కూడా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: రాగి జావ వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహగ్రస్తుల్లో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది సహాయపడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది: రాగి పిండిలో పలు రకాల అమినో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో తోడ్పడతాయి.జీవక్రియల మెరుగుదల: రాగిలోని పోషకాలు కండరాల ఆరోగ్యానికి, రక్తం తయారవ్వడానికి, జీవక్రియలు సాఫీగా జరగడానికి దోహదపడతాయి.. ఫైబర్ ప్రయోజనాలు: రాగుల్లోని ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీని వల్ల అధికంగా ఆహారం తీసుకోవడం తగ్గి, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. రాగి జావను సులభంగా తయారు చేసుకోవచ్చు.. ముందుగా నీటిలో కొంచెం (2–3 స్పూన్ల పిండిని కలుపుకోవాలి.. ముద్దలు కాకుండా చూడాలి.. అలాగే.. రెండు, మూడు గ్లాసుల నీటిని వేడి చేసి.. దానిలో ఈ రాగి పిండి వేస్తూ కలుపుకోవాలి.. సరిపడినంత ఉప్పు వేసుకుంటే సరిపోతుంది.అయితే.. రాగి జావను ఉదయం పూట ఖాళీ కడుపుతో తీసుకోవడం అత్యంత ఆరోగ్యకరం.. టిఫిన్ గా కూడా తీసుకోవచ్చు లేదా.. టిఫిన్ కంటే ముందు కూడా రాగి జావ తాగొచ్చు.. అంతేకాకుండా.. రాత్రి నిద్రకు ముందు కూడా దీనిని తీసుకోవచ్చు. కావాలంటే.. రాగి జావలో మజ్జిగ, పెరుగు కూడా కలుపుకుని తీసుకోవచ్చు.. దీనికి తోడు కొంచెం పచ్చి మిర్చి, ఉల్లి తురుము జోడించుకుంటే.. రుచి పెరుగుతుంది.. ఇలా తీసుకోవడం వల్ల ఎండలో వేడి చేయకుండా శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.



## పవర్‌ఫుల్ ఎనర్జీ కావాలంటే..

మన శరీరానికి పండ్లు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ముఖ్యంగా రాత్రంతా ఖాళీ కడుపుతో ఉన్న శరీరానికి ఉదయాన్నే పండ్లు అందిస్తే ఆ రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అయితే అల్పాహారంలో జామపండు తీసుకోవాలా లేక అరటిపండు తీసుకోవాలా అన్నది చాలా మందిని వేధించే ప్రశ్న. జామపండు: జామపండును పోషకాల పవర్‌హౌస్ అని అంటారు. ఇందులో ఉండే విటమిన్ సి పరిమాణం నారింజ పండు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. కేవలం 100 గ్రాముల జామలో 228 మి.గ్రా విటమిన్ సి లభిస్తుంది. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. జామపండులో తక్కువ కేలరీలు, అధిక పీచు పదార్థం ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. దీనిలోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అరటిపండు: అరటిపండు తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ బాంబ్ లాంటిది. ఉదయాన్నే వ్యాయామం లేదా జిమ్ చేసేవారికి ఇది దివ్యౌషధంలా



పని చేస్తుంది. అరటిపండులో ఉండే సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి వేగంగా శక్తిని అందిస్తాయి. ఇందులో పుష్కలంగా ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తూ.. రోజంతా మన మూడ్‌ని ఉత్సాహంగా, ఒత్తిడి లేకుండా ఉంచడానికి దోహదపడుతుంది. ఏది ఎంచుకోవాలి? ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అంటే అది పూర్తిగా ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రు షుగర్ లేదా బరువు తగ్గడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లయితే జామపండు ఉత్తమమైనది. అలా కాకుండా రోజంతా శారీరక శ్రమ చేసేవారు లేదా తక్షణమే అలసట నుండి ఉపశమనం పొందాలనుకునే వారు అరటిపండును ఎంచుకోవడం మంచిది. వాస్తవానికి శరీరానికి అన్ని రకాల పోషకాలు అందాలంటే ఒకరోజు జామ, మరొకరోజు అరటిపండు మార్చి మార్చి తీసుకోవడం అత్యుత్తమమైన పద్ధతి. ఉదయం ఖాళీ కడుపుతో పండ్లు తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. పండ్లు మరీ పుల్లగా లేకుండా చూసుకోవాలి, లేదంటే ఎసిడిటీ సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే డయాబెటిస్ ఉన్నవారు అరటిపండు తీసుకునేటప్పుడు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. జీవనశైలికి, శరీర తత్వానికి తగ్గట్టుగా సరైన పండును ఎంచుకుని రోజును ఆరోగ్యంగా ప్రారంభించండి.

## బెండకాయ నీరు తాగితే ఆశ్చర్యపోయే ప్రయోజనాలు!

ఈ వేసవి కాలంలో బెండకాయ విరివిగా లభిస్తుంది. పిల్లలు, పెద్దలు అందరూ ఈ బెండకాయను ఇష్టపడతారు. కానీ, బెండకాయ నీరు కూడా తాగొచ్చని కు తెలుసా..? అవును, 4–5 బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఈ నీటిని తాగడం వల్ల



ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయో కు తెలుసా? విటమిన్ ఎ, సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న బెండకాయ నీళ్లు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఓక్రా వాటర్‌ను ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగిన లేడీఫింగర్ వాటర్ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఆకలి తగ్గుతుంది. దీంతో వేగంగా బరువు తగ్గుతారు.బెండకాయలో సల్యూబుల్ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో గ్లూకోజ్ ఆకర్షణను తగ్గించి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. బెండకాయ నీటిని ప్రతిరోజూ తాగడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. బెండకాయలో ఉండే రసాయనం పొట్టలోని ఆమ్లాలను తటస్థం చేయడంలో సహాయపడుతుంది, తద్వారా గ్యాస్, అజీర్ణం, కడుపు సమస్యలను నివారించవచ్చు. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న ఓక్రా వాటర్ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. బెండకాయ నీరు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. విటమిన్ కె, కాల్షియం సమృద్ధిగా ఉండే ఓక్రా వాటర్ బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలపరుస్తుంది. ఓక్రా వాటర్ తాగడం వల్ల కంటి చూపు కూడా మెరుగుపడుతుంది. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న లేడీఫింగర్ వాటర్ చర్మానికి కూడా మేలు చేస్తుంది. బెండకాయలో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. ఇది రక్తంలో చక్కెరను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల కార్బోహైడ్రేట్ శోషణ కూడా నెమ్మదిస్తుంది. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## ట్రంప్ సీజ్‌ఫైర్.. భారీగా దిగొచ్చిన చమురు ధరలు



ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు వారాల బ్రేక్ ఇచ్చిన సంగతి తెలిసిందే (Trump Ceasefire). ఆయన అనూహ్యంగా కాల్పుల విరమణ ప్రకటించడంతో చమురు మంటలు కొంచెం చల్లారాయి (Oil Prices). బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 95.06 డాలర్లకు పడిపోయింది. అంతకుముందు ఒక బ్యారెల్ ధర 110 డాలర్లకు దగ్గర్లో ఉండటం గమనార్హం. ఇక యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ దాదాపు 20 శాతం తగ్గింది. ట్రంప్ ప్రకటనతో మార్కెట్లు వేగంగా స్పందించాయి. చమురు ధరలు పడిపోగా, అమెరికా మార్కెట్లు భారీగా పెరిగాయి. డౌ ఫ్యూచర్స్ 900 పాయింట్లు ఎగబాకింది. పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభమైన దగ్గరి నుంచి హర్మూజ్ అంతరాయాలతో చమురు ధరలు భగ్గుమంటోన్న సంగతి తెలిసిందే.




## 2025-26లో 24.52 లక్షల ఈవీ విక్రయాలు: ఫాడా

మన దేశంలో మొత్తం విద్యుత్ వాహనాల రిటెయిల్ విక్రయాలు 2025-26లో 24.52 లక్షలకు చేరాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా మంగళవారం వెల్లడించింది. 2024-25లో రిటెయిల్‌గా విక్రయమైన 20.37 లక్షల ఈవీల కంటే



ఇవి 24.6% అధికమని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ వెల్లడించారు. ప్రయాణికుల వాహన (పీవీ- కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) విభాగంలో మొత్తం విక్రయాలు 1,08,873 నుంచి 83.63% వృద్ధితో 1,99,923కు చేరాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 78,811 వాహన విక్రయాలతో ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ 53,089, మహీంద్రా అండ్ మహీంద్రా 42,721 వాహనాలను విక్రయించాయి. ద్విచక్ర వాహన విక్రయాలు 11,50,790 నుంచి 21.81% పెరిగి 14,01,818కు చేరాయి. టీవీఎస్ 3,41,413 వాహనాలతో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ 2,89,349, ఏథర్ ఎనర్జీ 2,39,178 వాహనాలను విక్రయించింది. త్రిచక్ర వాహన విక్రయాలు 6,98,914 నుంచి 18.97% పెరిగి 8,30,819కు చేరాయి. వాణిజ్య వాహనాల విక్రయాలు 8,820 నుంచి 120.57% పెరిగి 19,454కు చేరాయి.

## ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి సవరించిన ఆర్థిక బిడ్లు



ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయం కోసం నిర్ణయించిన రిజర్వ్ ధర కంటే, తక్కువ మొత్తం బిడ్లను 'సామర్థ్యం గల ఇద్దరు కొనుగోలుదారులు' వేసినందున.. ప్రభుత్వం వారి నుంచి సవరించిన ఆర్థిక బిడ్లను కోరే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియ సాంకేతిక మూల్యాంకన దశలో ఉందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, అనిశ్చితుల ప్రభావం నుంచి మనదేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే చర్యల కోసం వనరులను సమీకరించడానికి, ద్రవ్యపరమైన వెసులుబాటు కల్పించుకోవడానికి.. ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణపై ఆధారపడుతోందని అధికారులు వెల్లడించారు. మూడేళ్లకు పైగా సాగిన ప్రయత్నాల తర్వాత, ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియ ఆర్థిక బిడ్ల తుది దశకు చేరుకుంది. విక్రయాన్ని త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, ఈ ప్రక్రియ మొత్తాన్ని మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలనుకోవడం లేదు. అందువల్ల ఇప్పటికే ముందుకు వచ్చిన ఇద్దరు కొనుగోలుదార్లను, ఆర్థిక బిడ్లు సవరించి దాఖలు చేయమని కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి ప్రభుత్వం 2022 అక్టోబరులో ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను వివిధ సంస్థల నుంచి కోరింది. ప్రస్తుతం ఐడీబీఐలో ప్రభుత్వం (45.48%), ఎల్ఐసీ (49.24%)కి వాటాలు ఉన్నాయి.

## పశ్చిమాసియా సంక్షోభం వ్యాపారాలకు రూ.2.5లక్షల కోట్ల రుణ హామీ పథకం



పశ్చిమాసియా సంక్షోభ పరిణామాల ప్రభావంతో దేశీయంగా దెబ్బతిన్న వ్యాపారాలను, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం రూ.2.5 లక్షల కోట్లతో రుణ హామీ పథకాన్ని (క్రెడిట్ గ్యారంటీ) ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధం కారణంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల, రుణ చెల్లింపులో విఫలం (డిఫాల్ట్) అయిన వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిపాదిత పథకం కింద.. రూ.100 కోట్ల వరకు ఉన్న రుణాలపై బ్యాంకులకు 90% క్రెడిట్ గ్యారంటీ లభించనుంది. ప్రభుత్వ పూర్తి అనుబంధ సంస్థ నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ (ఎన్‌సీజీటీసీ) ద్వారా బ్యాంకు రుణాలపై ఈ హామీ ఇస్తారు. ఈ పథకం అమలు కోసం కేంద్రం సుమారు రూ.17,000 - 18,000 కోట్లు సమకూర్చాల్సి ఉంటుందని అంచనా. కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఇలాంటి పథకం అద్భుత విజయం సాధించిందని, వివిధ రంగాలకు చెందిన ఎన్నో వ్యాపారాలు మనుగడ సాధించేందుకు, బకాయిలు చెల్లించేందుకు అది ఎంతగానో ఉపయోగపడిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. కరోనా వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో ఎంఎస్ఎంఈలు, ఇతర అర్హత గల వ్యాపార సంస్థలు తమ నిర్వహణ బాధ్యతలను తీర్చుకునేందుకు వీలుగా 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్'లో భాగంగా 2020 మేలో ప్రభుత్వం 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీం(ఈసీఎల్‌జీఎస్)ను ప్రకటించింది.

## ఐపీఓ అనుమతుల చెల్లుబాటు గడువు పొడిగించిన సెబీ

తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల నిర్వహణకు ఇచ్చిన అనుమతుల చెల్లుబాటు గడువును సెప్టెంబరు 30 వరకు సెబీ పొడిగించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల, మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతుండటంతో పలు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను వాయిదా వేయాలని యోచిస్తున్నాయి. సెబీ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇలాంటి కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి 2026 సెప్టెంబరు 30 మధ్య ముగియనున్న ఐపీఓ నిర్వహణ అనుమతుల చెల్లుబాటు సమయాన్ని, 2026 సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తున్నట్లు




సెబీ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 మధ్య, కనీస ప్రజల వాటా నిబంధనలను పాటించాల్సిన గడువు ముగియనున్న కంపెనీలపైనా ఎలాంటి చర్యలు చేపట్టబోమని తెలిపింది. కొవిడ్-19 పరిణామాల సమయంలోనూ ఇదే తరహా ఉపశమన చర్యలను సెబీ చేపట్టింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. సెబీ అనుమతులు లభించాక 12 లేదా 18 నెలల్లోగా పబ్లిక్ ఇష్యూను కంపెనీలు నిర్వహించాలి. పశ్చిమాసియా అనిశ్చితుల్లో మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతుండటంతో, కేపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ, 25% కనీస ప్రజల వాటా నిబంధన పాటింపు విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సెబీకి పలువురు విన్నవించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని, ఐపీఓ అనుమతుల చెల్లుబాటు గడువును పెంచాలని సెబీ నిర్ణయించింది.

## వరుసగా రెండోసారి.. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పుల్లేవ్




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈమేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇదే. ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలోనూ ఈ వడ్డీరేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.

ఆర్‌బీఐ ప్రసంగంలోని కీలక అంశాలివే..

ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదుకావొచ్చని అంచనా వేస్తున్నాం.

చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చు.

ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.




## ముకేశ్-పలక్ స్వర్ణ గురి




అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి జోరు కొనసాగుతోంది. ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ ప్రపంచకప్‌లో అతడు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పలక్‌తో కలిసి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో ముకేశ్ ద్వయం 487.7 పాయింట్లతో జూనియర్ ప్రపంచ రికార్డు సృష్టిస్తూ అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో చో గయున్-సంగ్ (కొరియా, 483) జోడీ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్వాలిఫికేషన్లో 581 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్న ముకేశ్ జోడీ.. ఫైనల్లోనూ జోరు ప్రదర్శించింది. తుది పోరులో ముకేశ్ 244.7 పాయింట్లు.. పలక్ 243 పాయింట్లు సాధించారు. మరోవైపు క్వాలిఫికేషన్లో అగ్రస్థానంలో నిలిచిన కిన్‌యున్-కయ్ హు (చైనా, 586) జంట ఫైనల్లో తడబడింది. 484.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. వెరోనిక మజోర్-అకోస్ కరోలి (హంగేరి, 414.9) జోడీ మూడో స్థానాన్ని దక్కించుకుంది.

## డేవిడ్ వార్నర్ అరెస్టు

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ చిక్కుల్లో పడ్డాడు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. మంగళవారం మారూబ్రా ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 39 ఏళ్ల వార్నర్ పట్టుబడినట్లు సమాచారం.




పోలీసుల కథనం ప్రకారం.. మలబార్ రోడ్డులోని తనిఖీ ప్రాంతానికి కొంత దూరంలోనే వార్నర్ తన వాహనాన్ని నిలిపాడు. అనుమానం వచ్చిన పోలీసులు అక్కడికి చేరుకుని వార్నర్‌కు శ్వాస పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా తేలాడు. వెంటనే అతడిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి మరోసారి పరీక్షించగా.. రక్తంలో మద్యం మోతాదు 0.104గా నమోదైంది. చట్టబద్ధంగా అనుమతించిన పరిమితి కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. అనంతరం వార్నర్‌ను పోలీసులు విడుదల చేసినప్పటికీ వచ్చేనెలలో అతను కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచి కింగ్స్‌కు వార్నర్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈనెల 9న పెషావర్ జల్మీతో మ్యాచ్‌కు ముందు ఏడు రోజుల విరామం దొరకడంతో.. వ్యక్తిగత పర్యటన కోసం అతను సిడ్నీకి వచ్చాడు. అయితే ఈ చట్టపరమైన చర్యలు వార్నర్ తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లి పీఎస్ఎల్‌లో పాల్గొనడానికి ఎలాంటి ఆటంకం కలిగించవని తెలుస్తోంది.

## కుర్రాళ్లు కుమ్మేశారు.. రాజస్థాన్ హ్యాట్రిక్ విజయం



సూపర్ ఫామ్‌లో ఉన్న యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (77 నాటౌట్; 32 బంతుల్లో 10×4, 4×6), వైభవ్ సూర్యవంశీ (39; 14 బంతుల్లో 1×4, 5×6) రాజస్థాన్ రాయల్స్‌కు మరో విజయాన్నందించారు. వర్షం వల్ల మంగళవారం 11 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ఆ జట్టు 27 పరుగుల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను ఓడించింది. మొదట యశస్వి, వైభవ్‌ల మెరుపులతో రాజస్థాన్ 3 వికెట్లకు 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో ముంబయి 9 వికెట్లకు 123 పరుగులే చేసింది. ఆ జట్టు ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. తొలి ఓవర్లోనే రికెల్టన్ (8)ను ఔట్ చేసిన ఆర్చర్ రాయల్స్‌కు శుభారంభాన్నందించగా.. బర్గర్ బౌలింగ్‌లో సూర్యకుమార్ (6), సందీప్ శర్మ బౌలింగ్‌లో రోహిత్ శర్మ (5) ఔటైపోయారు. రవి బిష్ణోయ్ (2/25) ఒకే ఓవర్లో.. హార్దిక్ పాండ్య (9), తిలక్ వర్మ (14)లను ఔట్ చేసి ముంబయి ఓటమిని ఖాయం చేశాడు. తర్వాత షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (25; 8 బంతుల్లో 2×4, 2×6), నమన్ ధీర్ (25; 13 బంతుల్లో 3×4, 1×6)ల పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది.

తొలి బంతి నుంచే విధ్వంసం..: మొదట టాస్ గెలిచిన ముంబయి ఫీల్డింగ్ ఎంచుకోగా.. యశస్వి, వైభవ్‌ల మెరుపులతో రాజస్థాన్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. వీరి ధాటికి బుమ్రా, బౌల్ట్ లాంటి బౌలర్లూ నిలవలేకపోయారు. మధ్యలో వికెట్లు పడి, పరుగులు కట్టడి చేయబట్టి సరిపోయింది కానీ.. లేదంటే స్కోరు ఎక్కడికో వెళ్లిపోయేదే. తొలి వికెట్‌కు యశస్వి, సూర్యవంశీ 5 ఓవర్లలోనే 80 పరుగులు జోడించడం విశేషం. దీపక్ చాహర్ వేసిన తొలి ఓవర్లో యశస్వి.. ముంబయికి చుక్కలు చూపించాడు. మొదటి మూడు బంతులకు 4, 6, 4 బాదిన యశస్వి.. ఒక బంతి విరామం ఇచ్చి.. ఇంకో రెండు ఫోర్లు కొట్టాడు. తొలి ఓవర్లోనే 22 పరుగులతో రాయల్స్‌కు అదిరే ఆరంభం దక్కింది. రెండో ఓవర్లో సూర్యవంశీ కొట్టిన రెండు సిక్సర్లు మ్యాచ్‌కే హైలైట్. అతను ఆ షాట్లు ఆడింది జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో కావడం విశేషం. అతను కళ్లు చెదిరే రీతిలో మిడాన్‌లో, డీప్ స్క్వేర్ లెగ్‌లో బంతులను స్టాండ్స్‌లోకి పంపించాడు. మూడో ఓవర్ వేసిన బౌల్ట్‌కూ శిక్ష తప్పలేదు. తొలి రెండు బంతులకు జైస్వాల్ సిక్సర్ బాదితే.. నాలుగో బంతికి సూర్యవంశీ సిక్స్ అందుకున్నాడు. కేవలం 3 ఓవర్లలోనే 58 పరుగులు పిండేసుకుంది రాయల్స్. అయితే నాలుగో ఓవర్లో హార్దిక్ 4 పరుగులే ఇచ్చాడు ముంబయి కెప్టెన్. శార్దూల్ వేసిన అయిదో ఓవర్లో సూర్యవంశీ రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో చెలరేగిపోయాడు. అయిదో బంతికి నేరుగా కళ్లు చెదిరే సిక్సర్ బాదిన అతను.. చివరి బంతికి కవర్స్‌లో అద్భుతమైన షాట్ ఆడాడు కానీ, బౌండరీ వద్ద పొంచి ఉన్న తిలక్‌కు దొరికిపోయాడు. దీంతో రాజస్థాన్ జోరుకు బ్రేక్ పడింది. ఫామ్‌లో ఉన్న జురెల్ (2)ను తర్వాతి ఓవర్లో ఘజన్‌ఫర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. వైభవ్ ఔటయ్యాక స్కోరు వేగం తగ్గింది. తర్వాతి 3 ఓవర్లలో 30 పరుగులు వచ్చాయి. పరాగ్ (20; 10 బంతుల్లో 1×4, 2×6) ఉన్నంతసేపు ధాటిగానే ఆడాడు. అతడి తర్వాత వచ్చిన హెట్‌మయర్ (6 నాటౌట్) షాట్లు ఆడలేకపోయాడు. యశస్వి ఆఖర్లో సిక్సర్లు కొట్టలేకపోయినా.. కొన్ని చూడముచ్చటైన ఫోర్లతో స్కోరును 150కి చేర్చాడు. రాజస్థాన్ ఇన్నింగ్స్: యశస్వి నాటౌట్ 77; వైభవ్ (సి) తిలక్ (బి) శార్దూల్ 39; జురెల్ ఎల్బీ (బి) ఘజన్‌ఫర్ 2; పరాగ్ (సి) తిలక్ (బి) ఘజన్‌ఫర్ 20; హెట్‌మయర్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (11 ఓవర్లలో 3 వికెట్లకు) 150; వికెట్ల పతనం: 1-80, 2-84, 3-121; బౌలింగ్: దీపక్ 1-0-22-0; బుమ్రా 3-0-32-0; బౌల్ట్ 1-0-22-0; హార్దిక్ 2-0-17-0; శార్దూల్ 2-0-36-1; ఘజన్‌ఫర్ 2-0-21-2 ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 8; రోహిత్ ఎల్బీ (బి) సందీప్ శర్మ 5; సూర్యకుమార్ (సి) ఆర్చర్ (బి) బర్గర్ 6; తిలక్ వర్మ (సి) హెట్‌మయర్ (బి) బిష్ణోయ్ 14; హార్దిక్ (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 9; నమన్ ధీర్ (సి) బిష్ణోయ్ (బి) బర్గర్ 25; రూథర్‌ఫర్డ్ (సి) సందీప్ శర్మ (బి) తుషార్ 25; శార్దూల్ (సి) జురెల్ (బి) సందీప్ శర్మ 8; దీపక్ చాహర్ నాటౌట్ 6; బౌల్ట్ రనౌట్ 1; బుమ్రా నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (11 ఓవర్లలో 9 వికెట్లకు) 123; వికెట్ల పతనం: 1-10, 2-20, 3-22, 4-41, 5-46, 6-93, 7-103, 8-111, 9-116; బౌలింగ్: ఆర్చర్ 2-0-17-1; బర్గర్ 2-0-21-2; సందీప్ శర్మ 3-0-26-2; తుషార్ దేశ్‌పాండే 2-0-29-1; రవి బిష్ణోయ్ 2-0-25-2.

## ఆ విదేశీ ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలి: సునీల్ గావస్కర్



ఐపీఎల్‌లో తమ పాత్రను పూర్తిగా పోషించని విదేశీ ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ డిమాండ్ చేశాడు. పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని కేకేఆర్ ఆల్‌రౌండర్ కామరూన్ గ్రీన్ కేవలం బ్యాటింగ్‌కే పరిమితమవుతున్న నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. "ఒక మ్యాచ్‌లో ఓ బౌలర్ వేసేది నాలుగు ఓవర్లే. మరి వాళ్లు అలా చేయకుండా అడ్డుకుంటున్నదేంటి?" అని గావస్కర్ అన్నాడు. "ఒకవేళ ఆటగాడు ఫిట్‌గా లేకుంటే టోర్నీకి ముందే వైదొలగాలి. మరో ఆటగాణ్ని ఎంచుకునే అవకాశం ఫ్రాంఛైజీకి ఇవ్వాలి" అని చెప్పాడు. "బీసీసీఐ రంగంలోకి దిగాలి. తొలి మ్యాచ్ నుంచే అందుబాటులో లేని ఆటగాళ్ల విషయంలో అమలు చేస్తున్న నిబంధనల లాంటివే.. ఫిట్‌నెస్ పేరుతో మ్యాచ్‌లకు పూర్తిగా అందుబాటులో లేని ఆటగాళ్ల కోసం ప్రవేశపెట్టాలి" అని అన్నాడు. పూర్తి అంకిత భావంతో ఆడే ఆటగాళ్లు ఫ్రాంఛైజీలకు కావాలని గావస్కర్ చెప్పాడు.

## ముంబయి ఓటమి.. బౌలర్లే కారణం: హార్దిక్ పాండ్య




ఈ ఐపీఎల్ (IPL) సీజన్‌లో ముంబయి ఇండియన్స్ వరుసగా రెండో మ్యాచ్ ఓడిపోయింది. మంగళవారం రాత్రి రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య జట్టు పూర్తిగా తేలిపోయింది. ఈ ఓటమికి పూర్తి బాధ్యత బౌలింగ్ యూనిట్‌దేనని ముంబయి కెప్టెన్ పాండ్య (Hardik Pandya) తెలిపాడు. కనీసం ఐదు మంచి బంతులేసినా తమకు గెలిచే ఛాన్స్ ఉండేదన్నాడు. "మా జట్టు ఓటమిలో బ్యాటర్ల తప్పేం లేదు. లక్ష్యం ఎక్కువగా ఉండటంతో మొదటి బంతి నుంచే మాకు భారీ షాట్లు ఆడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, మేం బౌలింగ్‌లోనే సరిగ్గా రాణించలేదు. నాతో సహా మా బౌలింగ్ బృందం విఫలమైంది. ఈ ఓటమికి బౌలింగ్ యూనిట్‌దే బాధ్యత. కనీసం ఐదు బంతులైనా సిక్సర్లు వెళ్లకుండా కట్టడి చేయాల్సింది. అప్పుడు ముంబయి పోరాడేందుకు అవకాశం లభించేది" అని పాండ్య తెలిపాడు. "రాజస్థాన్ జట్టు గొప్పగా ఆడింది. ఆ జట్టు ఓపెనర్లు తొలి రెండు ఓవర్లలోనే గేమ్‌ను మా నుంచి లాగేసుకున్నాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు మేం ప్రయత్నించినా.. వెనుకబడిపోయాం" అని హార్దిక్ వివరించాడు. వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ముంబయి 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 3 వికెట్లకు 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి సీనియర్ బౌలర్లు బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్ తేలిపోయారు. ధారాళంగా పరుగులిచ్చేశారు. ఛేదనలో పాండ్య సేన 123 పరుగులకే పరిమితమైంది.

# వుదయం సినిమా

## జూన్ 26న లెనిన్ పోస్టర్ విడుదల



యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేని 'లెనిన్' మీదున్న హైప్ గురించి అందరికీ తెలిసిందే. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన 'లెనిన్' ఓ డిఫరెంట్ స్టోరీతో రాబోతోంది. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌తో మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. భావోద్వేగాలతో పాటుగా ఆకట్టుకునే కథనంతో కంప్లీట్ సినిమాటిక్ ప్యాకేజీగా 'లెనిన్' రూపుదిద్దుకుంటోంది. అఖిల్ అక్కినేని పుట్టినరోజు (ఏప్రిల్ 8) సందర్భంగా నిర్మాతలు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఈ పవర్ ఫుల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు.

## డెకాయిట్ బ్లాక్ బస్టర్ అవుతుంది

### ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విక్టరీ వెంకటేష్



**వుదయం సినిమా:**

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్ ,పాటలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. డెకాయిట్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. విక్టరీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.

విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. నా ఫేవరెట్ మావయ్య. ఎస్ ఎస్ క్రియేషన్స్ లో సుప్రియ ఇంత అద్భుతమైన సినిమా తీయడం చాలా ఆనందంగా ఉంది. కొన్ని సినిమాలు మొదలైనప్పుడే చాలా మంచి ఫీలింగ్ ఉంటుంది. సుప్రియ చాలా మంచి సినిమా తీస్తుందనే వైబ్ ఉండేది. ఎందుకంటే చాలా పాషన్ ఉన్న టీం తో చేశారు. అందరూ మంచి సినిమా తీయాలి, ప్రేక్షకుల ముందుకు రావాలి,పెద్ద హిట్ ఇవ్వాలి అనే ఉద్దేశంతో చేశారు. శేష్ ని పంజాలో చూశాను. అప్పుడే తను చాలా అద్భుతమైన నటుడు అవుతాడు అనిపించింది. తర్వాత ఆయన చేసిన సినిమాలన్నీ హిట్స్ అయ్యాయి. మరిన్ని బ్లాక్ బస్టర్ రావాలని కోరుకుంటున్నాను. డెకాయిట్ కూడా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది.



## అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా

# రాకా ఫస్ట్ లుక్

**వుదయం సినిమా:**

భారతీయ చిత్ర పరిశ్రమ ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ, టాప్ ప్రొడ్యూసర్ కళానిధి మారన్ సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రం ముందు వరుసలో ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ఆసక్తిగా క్రియేట్ చేసిన ఈ భారీ ప్రాజెక్ట్ టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రివీల్ చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కి 'రాకా' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ప్రస్తుతం ఈ టైటిల్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది.

ఇక 'రాకా' టైటిల్‌తో పాటుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఆయన బర్త్‌డే సందర్భంగా ఇచ్చిన ఈ అప్డేట్‌లతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ ఇంత వరకు కనిపించని ఓ కొత్త అవతారంతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గుండుతో, వింత శరీరాకృతితో అందరిలోనూ అంచనాల్ని పెంచేశారు. అల్లు అర్జున్ చూపుల్లో వాడివేడి, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు అందరిలోనూ అంచనాల్ని రెట్టింపు చేసింది.

ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అభిమానులు ఐకాన్ స్టార్ పుట్టినరోజును ఈ అప్డేట్లతో ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకుంటున్నారు. దాదాపు ఏడాది పాటు అభిమానులను ఎదురుచూసేలా చేసిన తర్వాత అట్లీ, అల్లు అర్జున్ ఈ అప్డేట్‌లతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. 'రాకా'తో సిల్వర్ స్క్రీన్ మీద ఏం క్రియేట్ చేయబోతోన్నారో అనే చర్చను మరోసారి లేవనెత్తారు.

## ఐకాన్ స్టార్‌కు ఆల్ ది బెస్ట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా "ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్" సభ్యులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. "రాకా" ఫస్ట్ లుక్ ను కూడా ఈసందర్భంగా అప్రిషియేట్ చేశారు. బర్త్ డే బోయ్ ను కలిసినవారిలో ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ప్రభు, అధ్యక్షులు బత్తుల ప్రసాద్, జనరల్ సెక్రటరీ సురేష్ కొండేటి, ట్రెజరర్ భరద్వాజ, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ లతోపాటు జాయింట్ సెక్రటరీ శ్యామ్ రావుట్ల, కార్యవర్గ సభ్యులు ధీరజ అప్పాజీ, కుమార్ తదితరులు ఉన్నారు. మీ అందర్నీ త్వరలోనే సావకాశంగా కలుస్తానని ఈ సందర్భంగా ఐకాన్ స్టార్ పేర్కొన్నారు. **వుదయం సినిమా :**



## చాయ్ షాట్స్ ద్వారా కొత్త సీరియల్స్

**వుదయం సినిమా:**

డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన చాయ్ బిస్కెట్ ఇటీవలే లాంచ్ చేసిన షార్ట్ సిరీస్ ఓటీటీ ప్లాట్‌ఫారం 'చాయ్ షాట్స్' సూపర్ సక్సెస్ సాధించింది. స్మార్ట్‌ఫోన్ ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'చాయ్ షాట్స్' కంటెంట్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేస్తూ కొత్త సీరియల్స్ తో పాటు తెలుగు ఐకానిక్ సీరియల్స్ ను కూడా చాయ్ షాట్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. శరత్ చంద్ర మాట్లాడుతూ.. డిసెంబర్‌లో చాయ్ షాట్స్ లాంచ్ ఈవెంట్ నిర్వహించాం. అప్పటికి యాప్‌ను ఎలా డిజైన్ చేయాలి, ఎలాంటి కంటెంట్ ఇవ్వాలని ఆలోచనల్లో ఉన్నాం. ఇప్పుడు మూడు నెలలు గడిచాయి. చాయ్ షాట్స్ లో టీవీ సీరియల్స్ తరహా కంటెంట్ చేసినప్పుడు అద్భుతమైన స్పందన వచ్చింది. అందుకే రమణి గారిని సంప్రదించి



దీన్ని ఇంకా పెద్ద స్థాయిలో ఎలా తీసుకెళ్లాలి అని చర్చించాం. ప్రస్తుతం టీవీకి పని చేస్తున్న యాక్టర్స్, డైరెక్టర్స్‌తో కలిసి దాదాపు డజన్ షార్ట్ సీరియల్స్ రూపొందించాం. 'ఋతురాగాలు' వంటి కల్ట్ సీరియల్స్ తో పాటు మరికొన్ని లెజెండరీ తెలుగు షోస్‌ను చాయ్ షాట్స్ లో తీసుకురాబోతున్నాం. చాయ్ షాట్స్‌ను టీవీ, ఓటీటీ కలిపి ఒక ప్యాకేజ్‌గా చేయాలని అనుకుంటున్నాం. చిన్నప్పుడు చూసిన 'పట్టుకుంటే పట్టు చీర' లాంటి షోను మళ్లీ రిక్రియేట్ చేశాం. హరితేజ గారితో ఆ షోను రూపొందిస్తున్నాం. ప్రతి రోజు మధ్యాహ్నం 1 గంటకు ప్రసారం అవుతుంది. ఇప్పుడు 'టీవీ ఎవరు చూస్తున్నారు?' అనే అభిప్రాయం ఉంది. కానీ టీవీలో ఉన్న భావోద్వేగాలు, డ్రామా.. ఇవన్నీ యాప్‌లోకి తీసుకురావడం మా లక్ష్యం."

## ఆయా షేర్ కొత్త రికార్డు

**వుదయం సినిమా:**



న్యాచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్' హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గ్లింప్స్, పోస్టర్లు, సింగిల్ సింగిల్ 'ఆయా షేర్'కు వస్తున్న భారీ స్పందనతో సినిమాపై అంచనాలు నెక్స్ట్ లెవల్ కి చేరుకున్నాయి. ముఖ్యంగా, ఆయా షేర్ పాట భారీ చార్ట్‌బస్టర్‌గా నిలిచి, సినిమాపై మ్యాసీవ్ హైప్ ని క్రియేట్ చేసింది, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన హైవోల్టేజ్ మ్యూజిక్ మరో స్థాయికి తీసుకెళ్లింది. 'ఆయా షేర్' విడుదలైన రోజు నుండి యూట్యూబ్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఇప్పుడు ఈ పాట 101 మిలియన్+ వ్యూస్ సాధించి, నాని పాటలలోనే వేగంగా ఈ ఫీట్ సాధించిన పాటగా నిలిచింది. సినిమా రిలీజ్‌కు ముందే 100 మిలియన్ మార్క్ దాటిన నాని తొలి పాటగా "ఆయా షేర్" రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ పాటను వైరల్ జోన్‌లోకి తీసుకెళ్లిన ప్రధాన కారణం నాని స్క్రీన్‌పై చూపించిన మాగ్నెటిక్ ఎనర్జీ. ఆయన డైనమిక్ మూవ్స్, ఫియర్స్ అటిట్యూడ్, అలాగే ఆకట్టుకునే హుక్ స్టెప్ సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇన్స్టాలో రీల్స్ వరదలా వచ్చాయి, యూట్యూబ్‌లో డ్యాన్స్ కవర్లు హోరెత్తించాయి, ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఆ స్టెప్స్‌ను రీక్రియేట్ చేశారు. పాట ఎంత గ్రాండ్‌గా వినిపిస్తుందో, అంతే గ్రాండ్‌గా కనిపించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. షూట్ కోసం ప్రత్యేకంగా భారీ స్లమ్ సెట్ నిర్మించారు. ఆ విజువల్స్‌కు రా, లార్జర్‌దెన్‌లైఫ్ ఫీల్ ఇవ్వడంతో పాటకు సరిపోయే ఇంటెన్సిటీ వచ్చింది. "ఆయా షేర్" ఈ స్థాయిలో రికార్డులు బద్దలు కొడుతూ, గ్లోబల్ ఆడియన్స్‌కు ఫేవరెట్‌గా మారడంతో "ది ప్యారడైస్" పై హైప్ అమాంతం పెరిగింది. సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ఎస్ఎల్ వి సినిమాస్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న వరల్డ్‌వైడ్‌గా విడుదల కానుండగా, అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

## ఓ..! సుకుమారి షూటింగ్ పూర్తి



**వుదయం సినిమా:**

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ గత చిత్రాలతో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ..! సుకుమారి' చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఫోటో లో హీరో తిరువీర్ తో పాటు టీమ్ మొత్తం ఒకేచోట చేరి సెలబ్రేట్ చేసుకుంటూ హ్యాపీ వైబ్ లో కనిపించారు. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వర ప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.

## ఐఎన్సీపీఏ అవార్డ్స్ విజేతల ప్రకటన









**వుదయం సినిమా:**

ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ తొలి ఐఎన్సీపీఏ అవార్డ్స్ విజేతలని ప్రకటించింది. పన్నెండు భాషలు, పన్నెండు సినిమా ఇండస్ట్రీలను ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎన్సీపీఏ ఈ ఏడాది మొత్తం 25 కేటగిరీలలో విజేతల అనౌన్స్ చేశారు. ఉత్తమ తెలుగు చిత్రంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ - మిరాయ్ సూపర్ యోధ విజేతగా ఎంపికైయింది. ఉత్తమ తెలుగు నటుడిగా నాగ చైతన్య (తండేల్) విజేతగా నిలిచారు. అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం) ఉత్తమ దర్శకుడిగా అవార్డ్ గెలుపొందారు.

**భాషల వారీగా ఐఎన్సీపీఏ అవార్డ్స్ విజేతలు:**

**అస్సామీ**
ఉత్తమ నటుడు: రవి శర్మ (రుద్ర)
ఉత్తమ నటి: నందిని కశ్యప్ (రుద్ర)
ఉత్తమ దర్శకుడు: రక్తిమ్ కమల్ బరువా (గులై సూర్)
ఉత్తమ చిత్రం: జెంగ్ ఎంటర్టైన్‌మెంట్, ఎవిఎస్ ఎఫ్ ఎఫ్ డిసి - గులై సూర్

**బెంగాలి**
ఉత్తమ నటుడు: ప్రోసెన్జిత్ చటర్జీ (దేవి చౌధురాణి).. ఉత్తమ నటి: కౌశాని ముఖర్జీ (కిల్‌బిల్ సొసైటీ)
ఉత్తమ దర్శకుడు: అన్నపూర్ణ బసు (శార్థోపర్)
ఉత్తమ చిత్రం: హోయిచోయ్ స్టూడియోస్, ఎస్ వి ఎఫ్ ఎంటర్టైన్‌మెంట్ - ది ఏకెన్: బెనారస్ ఎ బిభిషికా

**భోజ్‌పురి**
ఉత్తమ నటుడు: దినేష్ లాల్ యాదవ్ (మేరే హస్బండ్ కి షాది హై)
ఉత్తమ నటి: అమ్రపాలి దూబే (మేరే హస్బండ్ కి షాది హై)
ఉత్తమ దర్శకుడు: విశాల్ వర్మ (హమార్ నామ్ బా కన్హయ్యా)
ఉత్తమ చిత్రం: గిరిరాజ్ ప్రొడక్షన్ - హమార్ నామ్ బా కన్హయ్యా

**గుజరాతీ**
ఉత్తమ నటుడు: శ్రుహద్ గోస్వామి (లాలో - శ్రీ కృష్ణ సదా సహాయతే)
ఉత్తమ నటి: జాన్కి బోడియాలా (వష్ లెవల్ 2)
ఉత్తమ దర్శకుడు: అంకిత్ భూపత్‌భాయ్ సఖియా (లాలో - శ్రీ కృష్ణ సదా సహాయతే)
ఉత్తమ చిత్రం: మానిఫెస్ట్ ఫిలిమ్స్, జయ వ్యాస్ ప్రొడక్షన్, సౌల్ సుల్త్రా, నీమ్ ట్రీ ఎంటర్టైన్‌మెంట్, RD బ్రదర్స్ - లాలో

**హిందీ**
ఉత్తమ నటుడు: రణవీర్ సింగ్ (ధురంధర్)
ఉత్తమ నటి: యామి గౌతమ్ ధర్ (హక్)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్ (ధురంధర్)
ఉత్తమ చిత్రం: దినేష్ విజన్ & మాడ్‌డాక్ ఫిలిమ్స్ - ఛావా

**కన్నడ**
ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార: ఎ లెజెండ్ - చాప్టర్ 1)
ఉత్తమ నటి: రుక్మిణి వసంత్ (కాంతార)
ఉత్తమ దర్శకుడు: రిషబ్ శెట్టి (కాంతార)
ఉత్తమ చిత్రం: హోంబలే ఫిలిమ్స్ - కాంతార

**మలయాళం**
ఉత్తమ నటుడు: నివిన్ పాలీ (సర్వం మాయ)
ఉత్తమ నటి: కళ్యాణి ప్రియదర్శన్ (లోక చాప్టర్ వన్: చంద్ర)
ఉత్తమ దర్శకుడు: డొమినిక్ అరుణ్ (లోక చాప్టర్ వన్: చంద్ర)
ఉత్తమ చిత్రం: వే ఫారర్ ఫిలిమ్స్ - లోక చాప్టర్ వన్: చంద్ర

**మరాఠీ**
ఉత్తమ నటుడు: దిలీప్ ప్రభావాల్కర్ (దశావతార్)
ఉత్తమ నటి: అమృత సుభాష్ (జరాన్)
ఉత్తమ దర్శకుడు: సుబోధ్ ఖనోల్కర్ (దశావతార్)
ఉత్తమ చిత్రం: ధున్ ప్రొడక్షన్స్ - స్థల్

**ఒడియా**
ఉత్తమ నటుడు: బబుషాన్ మహంతి (బౌ బుట్టు భూత) ఉత్తమ నటి: అర్చిత సాహూ (బౌ బుట్టు భూత)
ఉత్తమ దర్శకుడు: సబ్యసాచి మహాపాత్ర & కుమార్ సి. దేవ్ మహాపాత్ర (అనంత)
ఉత్తమ చిత్రం: బబుషాన్ ఫిలిమ్స్ - బౌ బుట్టు భూత

**పంజాబీ**
ఉత్తమ నటుడు: తరసెం జస్సర్ (గురు నానక్ జహాజ్)
ఉత్తమ నటి: సర్గున్ మెహతా (సర్బాలా జీ)
ఉత్తమ దర్శకుడు: షరన్ ఆర్ట్ (గురు నానక్ జహాజ్)
ఉత్తమ చిత్రం: వెహ్లి జన్తా ఫిలిమ్స్, ట్రూ రూట్స్ ప్రొడక్షన్స్ - గురు నానక్ జహాజ్

**తమిళం**
ఉత్తమ నటుడు: దుల్కర్ సల్మాన్ (కాంతా)
ఉత్తమ నటి: సిమ్రాన్ (టూరిస్ట్ ఫ్యామిలీ)
ఉత్తమ దర్శకుడు: మారి సెల్వరాజ్ (బైసన్ కాలమాడన్)
ఉత్తమ చిత్రం: మిలియన్ డాలర్ స్టూడియోస్, MRP ఎంటర్టైన్‌మెంట్ - టూరిస్ట్ ఫ్యామిలీ

**తెలుగు**
ఉత్తమ నటుడు: నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి: రష్మిక మందన్న (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు: అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ చిత్రం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ - మిరాయి సూపర్ యోధా

**ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్**
మిథూన్, సచేత్‌పరంపర, రిషబ్ కాంత్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా, అర్సాన్ నిజామి
సినిమా: సయ్యారా
భాష: హిందీ

**ఉత్తమ సినిమాటోగ్రఫీ**
షాజీ కుమార్
సినిమా: తుడరం భాష: మలయాళం

**ఉత్తమ సహాయ నటుడు**
శరత్ కుమార్
సినిమా: 3BHK భాష: తమిళం

**ఉత్తమ సహాయ నటి**
సిమ్రాన్ మంగేశ్కర్
సినిమా: సితారే జమీన్ పర్ భాష: హిందీ

**ఉత్తమ పరిచయ నిర్మాత**
మానిఫెస్ట్ ఫిలిమ్స్, జయ వ్యాస్ ప్రొడక్షన్, సౌల్ సుల్త్రా, నీమ్ ట్రీ ఎంటర్టైన్‌మెంట్, ఆర్‌డీ బ్రదర్స్
సినిమా: లాలో - శ్రీ కృష్ణ సదా సహాయతే
భాష: గుజరాతీ

**ఉత్తమ ఎడిటర్**
శివకుమార్ పనిక్కర్
సినిమా: ధురంధర్ భాష: హిందీ

**ఉత్తమ కథ & స్క్రీన్‌ప్లే**
బషరత్ పీర్, నీరజ్ ఘయ్వాన్, సుమిత్ రాయ్
సినిమా: హోంబౌండ్ భాష: హిందీ

**ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ (మేల్)**
విశాల్ మిశ్రా - "తుమ్ హో తో"
సినిమా: సయ్యారా భాష: హిందీ

**ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ (ఫీమేల్)**
శ్రేయా ఘోషల్ - (సాంగ్: సయ్యారా రిప్రైజ్)
సినిమా: సయ్యారా భాష: హిందీ

**ఉత్తమ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్**
శశ్వత్ సచ్దేవ్
సినిమా: ధురంధర్ భాష: హిందీ

**బెస్ట్ VFX**
పీపుల్ మీడియా ఫ్యాక్టరీ VFX, డెక్కన్ డ్రీమ్స్
సినిమా: మిరాయ్ సూపర్ యోధా
భాష: తెలుగు

**ఉత్తమ పరిచయ నటుడు**
అహాన్ పాండే
సినిమా: సయ్యారా భాష: హిందీ

**ఉత్తమ పరిచయ నటి**
రియా శిబు
సినిమా: సర్వం మాయ భాష: మలయాళం

**ఉత్తమ పరిచయ దర్శకుడు**
కీర్తిశ్వరన్ - సినిమా: డ్యూడ్ (తమిళం)
రామ్ జగదీష్ - సినిమా: కోర్ట్ (తెలుగు)

**ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్**
వినేష్ బంగ్లాన్
సినిమా: కాంతార: ఎ లెజెండ్ - చాప్టర్ 1
భాష: కన్నడ

**ఉత్తమ హాస్య నటుడు**
రేవంత్ (బుల్లి రాజు)
సినిమా: సంక్రాంతికి వస్తున్నాం
భాష: తెలుగు

**బెస్ట్ కాస్టింగ్**
ముఖేష్ ఛబ్రా
సినిమా: ధురంధర్ భాష: హిందీ

**ఉత్తమ విలన్**
గుల్షన్ దేవయ్య
సినిమా: కాంతార: ఎ లెజెండ్ - చాప్టర్ 1
భాష: కన్నడ

**ఉత్తమ డాన్స్ కొరియోగ్రఫీ**
సాండీ మాస్టర్
సినిమా: కూలీ భాష: తమిళం

**ఉత్తమ ఫైట్ కొరియోగ్రఫీ**
టోడర్ లాజారోవ్
సినిమా: కాంతార: ఎ లెజెండ్ - చాప్టర్ 1
భాష: కన్నడ

**ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్**
షీతల్ ఇక్బాల్ శర్మ
సినిమా: ఛావా భాష: హిందీ

పన్నెండు భాషలు, పన్నెండు సినిమా ఇండస్ట్రీలను ప్రాతినిధ్యం వహిస్తూ ఐఎన్సీపీఏను అత్యంత విస్తృతమైన అకాడమీ వేదికగా రూపొందించారు.

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన అనుభవజ్ఞులైన సభ్యులతో కూడిన జ్యూరీ ప్యానెల్ విజేతలని ఎంపిక చేసింది.

ఐఎన్సీపీఏ అవార్డ్స్ వేడుక ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. దేశవ్యాప్తంగా ప్రముఖ దర్శకులు, నటులు, టెక్నీషియన్లు, నిర్మాతలు పాల్గొనే ఈ వేడుక భారతీయ సినిమా రంగానికి ఒక ముఖ్యమైన ఈవెంట్‌గా నిలవనుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.